ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి
జిల్లా వార్తలు

బుధవారం 26 ఫిబ్రవరి 2025

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



ఎన్నికల ఏర్పాట్లను వివరిస్తున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

- ఉత్తరాంధ్ర పరిధిలో 22,493 మంది ఓటర్లు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

- 8లో

గోవాడకు తీరని కష్టాలు

- లారీలకు కిరాయి సైతం చెల్లించలేని దుస్థితి
- కాటాల నుంచి ఫ్యాక్టరీకి చెరకు సరఫరాపై ప్రభావం
- చెరకు బండ్లతో రోజుల తరబడి రైతుల నిరీక్షణ
- అమలుకాని కూటమి నేతల హామీలు
- ప్రభుత్వం నుంచి కొరవడిన సహకారం

షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణకు నిధుల కొరత



మాడుగుల మండలం ఎం.కె.వల్లాపురం కాటా వద్ద చెరకు బండ్లు

చోడవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆర్థిక కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి. ఫ్యాక్టరీ నిర్వహణకు సైతం నిధులు లేకపోవడంతో చెరకు క్రషింగ్ పై తీవ్రంగా ప్రభావం చూపిస్తున్నది. ఇటీవల వరకు సాంకేతిక సమస్యలతో తరచూ చెరకు క్రషింగ్ ఆగిపోగా, పరిస్థితి కుదుటపడి క్రషింగ్ గాడిలో పడుతున్న సమయంలో కాటాల నుంచి చెరకు రవాణా అస్తవ్యస్తంగా తయారైంది. లారీలకు కిరాయి బకాయిలు పేరుకుపోవడంతో చెరకు రవాణాకు లారీల యజమానులు నిరాకరిస్తున్నారు. దీంతో కాటాల నుంచి ఫ్యాక్టరీకి చెరకు తెచ్చుకోవడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. కాటాల వద్ద చెరకు బండ్లు రోజుల తరబడి వేచివుండాల్సి వస్తున్నది. కాటాల వద్దకు తీసుకువచ్చిన చెరకును సకాలంలో ఫ్యాక్టరీకి తరలించకపోవడంతో రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. కాటాల వద్ద రోజుల తరబడి వుండిపోవడంతో చెరకు ఎండిపోయి, బరువుతోపాటు రసనాణ్యత తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని నిధుల కొరత వెంటాడుతున్నది. ప్రస్తుత క్రషింగ్ సీజన్ ప్రారంభం కాకముందే.. ఓవర్ హాలింగ్ పనులతోపాటు, సీజన్ నిర్వహణకు కనీసం రూ.5 కోట్లు సాయం అందించాలని ఫ్యాక్టరీ అధికారులు... ప్రజాప్రతినిధులను, కలెక్టర్‌ను, ఇతర ఉన్నతాధికారులను పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఆర్థికంగా ఆదుకోకపోతే చెరకు క్రషింగ్ సాధ్యం కాదంటూ పరిస్థితిని వివరించారు. కానీ ఇంతవరకు సానుకూలంగా ఎటువంటి స్పందన రాలేదు. ప్రభుత్వ సహకారం లేకుండా క్రషింగ్‌ను కొనసాగించవలసి రావడం అధికారులకు ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోవాడ ఫ్యాక్టరీకి పూర్వవైభవం వస్తుందని రైతులు భావించారు. కానీ ప్రభుత్వం నుంచి ఆర్థిక చేయూత లభించే పరిస్థితి లేకపోవడంతో అధికారులకు దిక్కుతోచడం లేదు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేయడానికి ముందుకు వస్తుండడం ఒక్కటే ఊరట కలిగిస్తున్న అంశం. అయితే చెరకు క్రషింగ్ చేయడం యాజమాన్యానికి గగనంగా మారింది. ఓవర్‌హాలింగ్ పనులకుతోడు ఫ్యాక్టరీ రన్నింగ్‌కు అవసరమైన నిధులు యాజమాన్యం వద్ద లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఫ్యాక్టరీలో క్రషింగ్‌కు అవసరమైన బగాస్ స్థానంలో వరి ఊక కొనడానికి సైతం మధ్యవర్తుల సాయంతో అప్పులు చేసి నెట్టుకొస్తున్నారు. ఇక ఫ్యాక్టరీలో అత్యవసరమైన విడిభాగాల కొనుగోలుకు సైతం తడుముకోవలసి వస్తున్నదని కార్మికులు అంటున్నారు.

వెంటాడుతున్న నిధుల కొరత

ఫ్యాక్టరీ నిర్వహణకు అత్యవసర నిధులు ఉండాలి. ఫ్యాక్టరీకి రావలసిన విద్యుత్ బకాయిలు రూ.85 లక్షలు రెండు వారాల క్రితం విడుదలయ్యాయి. మొలాసిస్ కొనుగోలుకు సంబంధించి విశాఖ డెయిరీ యాజమాన్యం నుంచి రూ. కోటి 25 లక్షలు, పంచదార విక్రయాలకు సంబంధించి మార్క్‌ఫెడ్ నుంచి రూ.75 లక్షలు రావలసి ఉంది. ఫ్యాక్టరీలో నాలుగు వేల క్వింటాళ్ల పంచదార ఉంది. టెండరుదారుడు ఈ పంచదార తీసుకెళ్లవలసి ఉంది. దీనివల్ల కోటి 60 లక్షల రూపాయలు వస్తాయి. గోవాడకు సుమారు రూ.3 కోట్ల 60 లక్షల వరకూ రావాల్సి వుంది. కానీ అవి ఎప్పుడు వస్తాయో చెప్పలేని పరిస్థితిలో అధికారులు ఉన్నారు.

ప్రకటనలకే పరిమితమైన సాయం

గోవాడ షుగర్స్‌ను గాడిలో పెట్టడంతోపాటు, ఫ్యాక్టరీని అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి ఎంపీ ఎమ్మెల్యేలు, జనసేన నేతలు చెబుతున్నారు ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకుని వస్తామని గట్టిగానే హామీలు ఇచ్చారు. ఎంపీ ఒకసారి, ఎమ్మెల్యేలు రెండుసార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించి, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ప్రభుత్వ పరంగా ఎటువంటి సాయం లభించలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం రూ.5 కోట్లు అయినా ప్రభుత్వం కేటాయించకపోతే ఫ్యాక్టరీలో క్రషింగ్ సాఫీగా జరిగే పరిస్థితి లేదని అంటున్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం సంగతి అటుంచి.. కనీసం మనుగడ కోసం అయినా ప్రభుత్వం సాయం అందించాలని చెరకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులు కోరుతున్నారు.

ఉపాధి బిల్లులకు నిరీక్షణ

పనులు పూర్తి చేసి నెల నుంచి మూడు నెలలు అయినా విడుదల కాని నిధులు

- జిల్లాలో రూ.58 కోట్ల మేర పెండింగ్
- గోకులం షెడ్ల బిల్లులకు రైతులు ఎదురుచూపులు
- వారంలో నిధులు విడుదల అవుతాయంటున్న అధికారులు



సబ్బవరం మండలం అసకపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ పనుల్లో భాగంగా గత ఏడాది నవంబరులో జిల్లాలో ప్రారంభించిన పలు రకాల అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల విడుదలలో జాప్యం జరుగుతున్నది. దీంతో పనులు చేపట్టిన చిన్నాచితకా కాంట్రాక్టర్లు, గోకులం షెడ్లు నిర్మించుకున్న రైతులు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా బిల్లులు మంజూరు కాకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణంతోపాటు పశువుల కోసం రైతులు రేకుల షెడ్లు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రహదారుల నిర్మాణాన్ని సంక్రాంతినాటికి పూర్తిచేయాలని అధికారులను ఆదేశించింది. అయితే గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలురకాల పనులకు బిల్లులు సక్రమంగా విడుదల చేయలేదు. గత ప్రభుత్వంలో అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు వెనుకంజ వేశారు. దీంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి జిల్లాల అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లు, సమీక్షలు నిర్వహించారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా పని పూర్తిచేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని భరోసా ఇవ్వడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. ప్రతి శుక్రవారం బిల్లుల చెల్లింపులు జరుగుతాయని అధికారులు చెప్పడంతో పలు గ్రామాల్లో కూటమి పార్టీల నేతలే సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. చకాచకా పనులు పూర్తి చేశారు. కానీ నెల నుంచి మూడు నెలలు అవుతున్నప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లు, బిల్లులు కోసం ఎదురు చూస్తున్నారు.

ఆగిన చెల్లింపులు రూ.58 కోట్లు పైమాటే

జిల్లాలో గత ఏడాది అక్టోబరులోఉపాధి హామీ పథకం కింద 2,285 నిర్మాణ పనులను రూ.148.47 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం మంజూరు చేసింది. జనవరి మొదటి వారంనాటికి 1,906 పనులు ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో 164 కిలోమీటర్ల పొడవున 1,514 సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. వీటిలో అత్యధిక శాతం పనులు ఇప్పటికే పూర్తి చేసి రూ.68 కోట్ల మేర బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. వీటిలో రూ.10 కోట్ల బిల్లులు మాత్రమే క్లియర్ అయ్యాయి. మిగిలిన రూ.58 కోట్ల బిల్లులు చెల్లింపులకు నోచుకోలేదు.

గోకులాల బిల్లులూ పెండింగ్

పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉపాధి నిధులతో జిల్లాలో రూ.16 కోట్ల అంచనా వ్యయంతో 851 మినీ గోకులాల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో 592 పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఆయా రైతులకు బిల్లులు మంజూరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి నిధులను రాష్ట్ర ఖాతాకు విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగానే బిల్లుల చెల్లింపులు ఆలస్యమయ్యాయిని, వారం రోజుల్లో ఆయా కాంట్రాక్టర్లు, గోకుల పథకం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు.



నక్కపల్లి మండలం దేవవరంలో నిర్మించిన మినీ గోకులం షెడ్డు

ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం

మండలానికి ఒక గ్రామంలో శత శాతం అమలు

- రానున్న ఖరీఫ్ నుంచే అమలు
- ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని, ఇందులో భాగంగా ప్రతి మండలంలో ఒక ఊరును పూర్తిగా ప్రకృతి వ్యవసాయం గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రైతు సాధికార సంస్థ, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో రానున్న ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం లక్ష్యాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి రానున్న రెండు నెలల్లో చేయవలసిన పనులపై ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి అవసరమైన వనరులు వున్న గ్రామాలను ముందుగా గుర్తించాలని తెలిపారు. ఇందులో ప్రధానమైనవి ఆవులని, వీటికి సంబంధించిన గణాంకాలను పశుసంవర్థక శాఖ నుంచి తీసుకోవాలని తెలిపారు. తొలుత గ్రామస్థాయి, మండల స్థాయిలో కనీసం మూడు సమావేశాలు నిర్వహించాలని, అనంతరం ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని గుర్తించి నూరుశాతం ప్రకృతి సేద్యం అమలు చేయాలని తెలిపారు. రైతులు పెట్టుబడి లేని ప్రకృతి సేద్యంవైపు మళ్లేలా ప్రోత్సహించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వాటిని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని, వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం అమలులో గిరిజన ప్రాంతాల్లో రసాయన ఎరువులు వాడకుండా, సేంద్రీయ ఎరువులతోనే రైతులు పంటలు పండిస్తుంటారని, అందువల్ల ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు, రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్.లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆగిన ధాన్యం కొనుగోళ్లు

లక్ష్యం పూర్తయ్యిందంటున్న మండలాల అధికారులు

- ధాన్యం అమ్మకాలకు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- బస్తాకు రూ.200 మేర తక్కువకు అమ్మకం



నాతవరం మండలం గునుపూడిలో ధాన్యం బస్తాలతో రైతు

నాతవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): **మండలంలో ధాన్యం కొనుగోళ్లను పౌరసరఫరాల శాఖ అధికారులు మూడు వారాల నుంచి నిలిపివేశారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి అడిగితే.. ధాన్యం కొనుగోళ్లు లక్ష్యం పూర్తయినందున నిలిపివేసినట్టు సిబ్బంది చెబుతున్నారని రైతులు అంటున్నారు. దీంతో నూర్చిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు.**

నాతవరం మండలంలో తాండవ రిజర్వాయర్‌తోపాటు ఇతర వనరుల కింద సుమారు 20 వేల ఎకరాల్లో వరి సాగు అవుతున్నది. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో వరి కోతలు కోసిన రైతుల్లో పలువురు నూర్పులు పూర్తిచేసి ప్రభుత్వం ద్వారా ధాన్యం విక్రయించారు. అయితే రోడ్డుకు దూరంగా వున్న పొలాలు, బండి బాటలేని చోట్ల రైతులు వరి కుప్పలను నూర్చలేదు. వరి కోతల అనంతరం వేసిన మినుము, పెసర పంటలు పండడంతో ఇప్పుడిప్పుడే వరి కుప్పలను నూర్చుతున్నారు. ధాన్యం అమ్మడానికి రైతు సేవా కేంద్రాలకు వెళితే.. మండలంలో ధాన్యం కొనుగోళ్ల టార్గెట్ పూర్తయ్యిందని, అందువల్ల కొనుగోలు చేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఏం చేయాలో పాలుపోక దళారులు అడిన ధరకు అమ్ము కోవాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం 75 కిలోల ధాన్యం బస్తాను రూ.1,725కి కొనుగోలు చేస్తుంటే.. దళారులు రూ.1,500-1,600లకు మించి కొనుగోలు చేయడంలేదని చెబుతున్నారు. దీనివల్ల ఎకరాకు ఆరేడు వేల రూపాయల వరకు నష్టపోతున్నామని వాపోయారు. పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు స్పందించి నాతవరం మండలంలో ధాన్యం కొనుగోళ్లను పునరుద్ధరిం చాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గొలుగొండ మండలంలో..

గొలుగొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వారం రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం అమ్మపేట, పాతల్లంపేట, ఏటిగైరంపేట, పాకలపాడు, రావణాపల్లి, కొత్తమల్లంపేట, జోగంపేట, గొలుగొండ చీడిగుమ్మల, గుండుపాల గ్రామాల్లో వరికుప్పలు నూర్పులు జరుగుతున్నాయి. మండలంలో చీడిగుమ్మల, చోద్యం, గొలుగొండల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, 595 టన్నుల ధాన్యాన్ని

... మిగతా 8వ పేజీలో

జేసీ అనుమతించిన వెంటనే ధాన్యం కొనుగోళ్లు



నాతవరం మండలంలో ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంపై పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా... ధాన్యం కొనుగోళ్లను తాత్కాలికంగా నిలుపుదల చేశామని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేయాలని నాతవరం, నర్సీపట్నం, మాకవరపాలెం తదితర మండలాల రైతుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని, ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్, పౌరసరఫరాల ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చిన వెంటనే ధాన్యం కొనుగోళ్లు పునఃప్రారంభిస్తామని ఆమె చెప్పారు.

జయంతి, పౌరసరఫరాల శాఖ డీఎం



వేదికపై చికెన్ తింటున్న కలెక్టర్, ఆర్డీవో తదితరులు

జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ లేదు

- చికెన్, కోడిగుడ్లు నిర్భయంగా తినొచ్చు
- కలెక్టర్ విజయకృష్ణన్ భరోసా
- అనకాపల్లిలో చికెన్, ఎగ్ మేళా

-వార్త 8వ పేజీలో

128 కిలోల గంజాయితో ఆరుగురి అరెస్టు

అనకాపల్లి పట్టణ పోలీసులు తుమ్మపాల సమీపంలో ఏలేరు కాలువ వద్ద 128 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.

- 8లో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- నేడు పోలింగ్ సామగ్రి పంపిణీ
- జిల్లాలో 2,885 మంది ఓటర్లు



కలెక్టరేట్‌లో ఎన్నికల సామగ్రి సిద్ధం చేస్తున్న అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం జరగనున్న ఎన్నికల్లో జిల్లాలో 2,885 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుంది. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పోలింగ్ అధికారి, ఒక సహాయక పోలింగ్ అధికారి, ఇద్దరేసి చొప్పున 48 మంది సిబ్బందిని నియమించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించనున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు బయట, లోపల వెబ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ విజయకృష్ణన్ పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్‌లో పోలింగ్ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్‌ను సిద్ధం చేశారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని వెల్లడించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించారు. పది మంది సెక్టోరియల్ అధికారులతోపాటు పది మంది రూట్ ఆఫీసర్లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. పోలింగ్ సిబ్బందికి బుధవారం ఉదయం అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామగ్రిని అందజేయనున్నారు.



నెహ్రూచౌక్‌లో మద్యం దుకాణానికి సీలు వేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

మద్యం దుకాణాలకు తాళాలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లు మంగళవారం సాయంత్రం మూతపడ్డాయి. ఎక్సైజ్ అధికారులు ఆయా దుకాణాల వద్దకు వెళ్లి సీళ్లు వేశారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి గురువారం సాయంత్రం నాలుగు గంటల వరకు మద్య షాపులు తెరవరు.

మార్కెటింగ్ మాయ

రైతుబజార్లలో గిమ్మిక్కులు

- టమాటా ఉదయం కిలో రూ.12, సాయంత్రం రూ.14
- అచ్యుతాపురం సరకుకు ఒక రేటు, అనంతపురం సరుకైతే మరో రేటు
- వివక్ష తగదని వాపోతున్న స్థానిక రైతులు



పండించిన టమోటాను ఏమి చేయాలా? అని తల పట్టుకున్న అచ్యుతాపురం రైతులు

విశాఖపట్నం/గాజువాక/అచ్యుతాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వం ఒకటి చెబితే...వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు మరొకటి చేస్తున్నారు. దీనివల్ల స్థానిక రైతులు నష్టపోతున్నారు. నగరంలోని రైతుబజార్లలో మంగళవారం ఉదయం టమాటా కిలో ధర రూ.12గా బోర్డుపై రాశారు. సాయంత్రం రూ.14 చేశారు. ఇలా ఉదయం ఒక రేటు, సాయంత్రం ఒక రేటు పెట్టిన సందర్భాలు ఎప్పుడూ లేవు. దీనిపై ఆరా తీస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి.**

టమాటా విస్తారంగా పండడంతో ధర పడిపోయింది. రవాణా చార్జీలు కూడా రావడం లేదని కొందరు రైతులు కోయకుండా పొలంలోనే వదిలేస్తున్నారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో రైతులను ఆదుకోవాలని, వారి పంటను రైతుబజార్లలో విక్రయించుకోవడానికి అవకాశం కల్పించాలని ఆదేశించింది. దాంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో తిరిగి రైతుబజార్లకు వచ్చి ఉత్పత్తులు

... మిగతా 8వ పేజీలో

పాడి రైతులకు బీమా



చెక్కుని అందజేస్తున్న విశాఖడెయిరీ అధ్యక్షుడు ఆనందరావు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులతో పాటు వాటిని పెంచే రైతులకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తున్నామని విశాఖ డెయిరీ మడుతూరు పాలసంఘం అధ్యక్షుడు శనివాడ ఆనంద రావు తెలిపారు. సోమవారం పాడి పశువులు చనిపోయిన ఇద్దరు రైతులకు ఆయన బీమా చెక్కులను అందజేశారు. మోటూరు నూకరాజు ఆవుకి రూ. 38 వేలు, ఎస్. రమణమ్మకి రూ.30 వేలు ఆందజేశారు. ఈ సందర్భంగా పాడి రైతులను ఆదుకోవడంలో విశాఖ డెయిరీ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. రైతులకు బోనస్, పలు పథకాలను అందిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణతో బోధన మెరుగు



మాట్లాడుతున్న ఎంఈవో అరుణ్‌కుమార్

ఎలమంచిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. రెండు బ్యాచ్‌లుగా మండలంలోని అంగన్ వాడీ కార్యకర్తలకు వారం రోజులపాటు రీసోర్స్ పర్సన్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందించారు. అంగన్‌వాడీ కేంద్రాలు మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలతోపాటు చిన్నారుల్లో నైపుణ్యాలను మెరుగుపరచడంలోని బోధనపై అవగాహన కల్పించినట్టు మండల విద్యాశాఖ అధికారి-2 అరుణ్‌కుమార్ తెలిపారు. రీసోర్స్ పర్సన్‌లుగా ప్రేమ్‌కుమార్, రాజు, మెడిటేషన్ విభాగంలో వరలక్ష్మి, సుహాసినిలు సూచనలు అందించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలంతా శిక్షణలోని అనేక అంశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మెలకుల ద్వారా చిన్నారులకు ఆకట్టుకునే బోధన సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారు 51 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్ రంజాన్ బీబీలు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

మునగపాక, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మండలంలో కాకరాపల్లి గ్రామంలో మంగళవారం ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. గ్రామంలో శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు ఆయన వివరించారు. రూ.21,800, పేక దస్తాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు అలాగే, పేకాట, ఇతర అసాంఘిక కార్య క్రమాలకు ఎవరైనా పాల్పడితే సమాచారం ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు.

కాలువ గేట్లకు మరమ్మతులు చేపట్టాలి

నీటి సంఘం చైర్మన్ గెడ్డం చైతన్య



ఇరిగేషన్ ఏఈకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరందించే భూమి కాలువ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని భూమి కాలువ నీటి సంఘం చైర్మన్ గెడ్డం చైతన్య డిమాండ్ చేశారు. పట్టణంలో జలవనరులశాఖ కార్యాలయంలో ఏఈ శ్రీరామ్మూర్తిని మంగళవారం నీటి సంఘం డైరెక్టర్లు కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గెడ్డం చైతన్య మాట్లాడుతూ పాయకరావుపేట నుంచి నక్కపల్లి మండలం ఉద్దండపురం వరకు పది గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరందించాల్సిన భూమి పంట కాలువపై పలు చోట్ల ఉన్న డివిజన్ డ్యామ్‌ల గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఏటా ఆయకట్టు భూములకు అవసరమైన సమయాల్లో సాగునీరందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమి కాలువ గేట్లకు కూడా మరమ్మతులు చేపట్టి అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు పల్లి దుర్గారావు, భూమి కాలువ నీటి సంఘం వైస్ చైర్మన్ పైలా నూకయ్యనాయుడు, డైరెక్టర్లు గర్లంక కొండలరావు, పక్కుర్తి లోవకుమార్, టి.శివ, టి.వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల సమగ్ర అభివృద్ధి సాధించడంలో భాగంగా అంగనవాడీ కార్యకర్తల నైపుణ్యాలు బలోపేతం చేసి, వారి ద్వారా ప్రీ స్కూల్ పిల్లలను ప్రాథమిక పాఠశాల విద్యకు సిద్ధం చేయడం కోసం 78 మంది అంగనవాడీ కార్యకర్తలు ఈ శిక్షణ పొందారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు శిక్షణ పొందిన అంగన్ వాడీలకు ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వప్నప్రియరెడ్డి, డీఆర్‌పీలు వై.శివకృష్ణ, ఎస్ఎస్ఎం చక్రవర్తి, ఎ.ప్రవీణ్, సూపర్‌వైజర్ తులసి, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో...

కోటవురట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు విడతులగా నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో మారుతున్న కాలానికి అనుగుణంగా చిన్నారులకు ఆట బొమ్మలు, ఆటపాటలతో ఏ విధంగా విద్యబోధన చేయాలో రిసోర్సుపర్సన్స్ విలియమ్స్, అప్పారావు బోధించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రామారావు, జోషి మాట్లాడుతున్న శిక్షణ పొందినవారంతా ఆయా కేంద్రాల్లో పిల్లలకు ఆకట్టుకునే విధంగా సులువైన విధ్యబోధన చేయాలని సూచించారు.



వాడ్రాపల్లి స్వయంభూ శివలింగం



వాడ్రాపల్లి దక్షిణేశ్వరుడు ఆలయం



వెంకటాపురం నీలకంఠేశ్వరస్వామి

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

- ▸▸ వాడ్రాపల్లి, వెంకటాపురం స్వయంభూ శివలింగాలు
- ▸▸ మహాశివరా త్రికి ఆలయాల వద్ద ఘనంగా ఏర్పాట్లు

మునగపాక, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాత్రివేడుకలకు పలు ఆలయాలు సిద్ధమయ్యాయి. వాడ్రాపల్లి, వెంకటాపురం గ్రామాల్లో శివాలయాలకు శతాబ్దాల చరిత్ర ఉంది. వాడ్రాపల్లిలో సుమారు 250 ఏళ్ల కిందట గ్రామ శివారు మల్లవరం పంట భూమిల్లో మట్టి దిబ్బలను, పుట్టలను తొలగించి కాలువ గట్టు ఏర్పాటుకు ఆ ప్రాంత రైతులు తవ్వకాలు చేపడుతుండగా, శివలింగం ఆకారంలో రాయి కనిపించింది. గ్రామంలో దానిని ప్రతిష్ఠించాలని లోతుగా తవ్వకాలు చేశారు. ఎంతగా తవ్వినా శివలింగం పూర్తిజాడ కనిపించలేదు. అదే సమయంలో విషసర్పాలు సంచరించడంతో శివ మహిమగా భావించి శిలను తొలగించడం నిలిపేశారు. ఆ స్థలం సూరిశెట్టి అప్పలనాయుడుకు చెందింది కావడంతో అతను శివలింగం ఉన్న ప్రాంతంలో గర్భగుడిని నిర్మించాడు. తర్వాత కొన్నేళ్లకు ఆడారి సన్యాసినాయుడు మండపం నిర్మించారు. ప్రస్తుతం ఆలయ ధర్మకర్తగా సూరిశెట్టి పరమేశ్వరరావు వ్యవరిస్తున్నాడు. శివలింగం దక్షిణముఖంగా వెలియడంతో దక్షిణేశ్వరుడు ఆలయంగా ప్రసిద్ధి చెందింది. మండలంలో వెంకటాపురంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి కూడా శతాబ్దాలు చరిత్ర ఉంది. శివలింగం కూడా స్వయం భూగా వెలియడంతో గత ఏడాది ఆలయ పున నిర్మాణం చేశారు. ఎక్కడా లేని విధంగా ఈ ఆలయానికి నాలుగు ద్వారబంధాలు ఉండటం విశేషం. శివరాత్రి వేడుకలకు ప్రత్యేక పూజలు, అభిషేకములు, అన్నసమారాధనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు.

నేడు కొత్తపట్నంలో తీర్థమహోత్సవం

రాంబిల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన కొత్తపట్నంలో కొలువై ఉన్న గౌరీపరమేశ్వరులు, అభయాంజనేయస్వామివారి తీర్థమహోత్సవం బుధవారం ఘనంగా జరుగనుంది. గ్రామ సమీపాన సముద్రతీర సమీపంలో ఉన్న స్వామివార్లను స్థానికులతోపాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించి మొక్కులు తీర్చుకోనున్నారు. ఈ నేపథ్యంలో తీర్థ మహోత్సవానికి అన్నిరకాల ఏర్పాట్లు చేసినట్టు సర్పంచి చోడిపిల్లి పార్వతి, గ్రామ పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక భజన పోటీలు, గ్రామ నాయకులు ఎరిపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. సెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, దుంపల అప్పలరాజు ఆధ్వర్యంలో జూనియర్ వాలీబాల్ పోటీలు, ఉమ్మిడి చిన్నయ్యగారి జ్ఞాపకార్థం నాగేశ్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక పెద్దలు తెలిపారు.



కొత్తపట్నం తీరసమీపంలో పూజలందుకుంటున్న శివలింగం



గౌరీపరమేశ్వరులు కొలువై ఉన్న ఆలయం

రఘువర్మకు మద్దతుగా ప్రచారం

ఎలమంచిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని కోరుతూ మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులను టీడీపీ నేతలు కలిసి మద్దతు కోరుతూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు మధుసూదన్, పార్టీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి రాజు, నాయకులు కాంద్రకోట చిరంజీవి, రాజాన వెంకునాయుడు తదతరులు పాల్గొన్నారు.

పాకలపాటికి మద్దతు తెలిపిన ప్రైవేటు కళాశాలల అసోసియేషన్

ఎలమంచిలి: ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను మంగళవారం కలిసి తమ మద్దతును ప్రకటించినట్టు ప్రైవేటు కళాశాల అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యుడు కె.శ్రీను తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలపై తాము ఈ మేరు మద్దతు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: రఘువర్మను గెలిపించాల్సిందిగా నునపర్తి పంచాయతీ పరిధిలోని పాఠశాలల్లో నునపర్తి టీడీపీ శ్రేణులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి నగేశ్, బొద్దూరు వరహాల రాము. గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, కన్నూరు ఎర్రి నాయుడు, రెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రఘువర్మను కలిసి మద్దతు తెలుపుతున్న ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు

ఆయిల్‌పామ్ నర్సరీని సందర్శించిన మలేషియా బృందం

కోటవురట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మలేషియాకు చెందిన శాస్త్రవేత్తల బృందం మంగళవారం మండలం రాజుపేటలో పతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ వారి ఆయిల్ పామ్ నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగుకు తమ దేశంలో వాతావరణ పరిస్థితులు, నేలలు అత్యంత అనకూలంగా వుండడంతో హెక్టారుకు 50 టన్నుల దిగుబడి సాధిస్తున్నామని చెప్పారు. మలేషియాలో ఎడారి ప్రాంతంలో కూడా ఏడాదిలో తొమ్మిది నెలలపాటు వర్షాలు కురుస్తాయని, అందువల్ల సాగునీరు పుష్కలంగా అందుబాటులో వుండడం వల్ల ఆయిల్‌పామ్ సాగులో అధిక దిగుబడులు సాధ్యమవుతున్నాయని వెల్లడించారు.



రాజుపేటలో ఆయిల్ పామ్ నర్సరీని పరిశీలిస్తున్న మలేషియా శాస్త్రవేత్తల బృందం

రఘువర్మకు మద్దతుగా కూటమి నేతల ప్రచారం



రఘువర్మకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న పాకలపాటి రఘువర్మ తరపున పాయకరావుపేటలో కూటమి నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరాకాలనీ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీనుతోపాటు నాయకులు పల్లా విలియంకేరి, కె.సత్తిబాబు, ఇంజరపు సూరిబాబు, ఎస్.నాగమల్లి, కువల కుమార్, బోడపాటి శ్రీను, గారా చంటి, ఐఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి శివారున ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా మంగళవారం నిర్వహిస్తున్న గుల్లాటలు, కోడి పందేల శిబిరాలపై దాడులు చేసినట్టు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బంది దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. కోడి పందాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోళ్లు, రూ.1420 నగదు స్వాధీనం చేసుకున్నామ న్నారు. అలాగే గుల్లాటలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి రూ.3020లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చెరకు లోడుతో లారీ బోల్తా



బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రహదారిలో విజయరామరాజుపేట వంతెన వద్ద మంగళవారం చెరకు లోడుతో లారీ బోల్తా పడింది. వడ్డాది నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు లోడుతో వెళుతున్న లారీ, వంతెన సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా లారీ నుంచి బయటకు దూకేయడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. చెరకు రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయింది.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



వర్మీ కంపోస్టు తయారు గురించి వివరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల నుంచి తడి, పొడి చెత్త సేకరించే విధానంపై పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న క్లాప్ మిత్రలకు, కార్యదర్శిలందరికీ మంగళవారం ఎస్.రాయవరంలో సంపద తయారీ కేంద్రం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాలు, జీరో వేస్ట్ మేనేజ్మెంట్, నాడెప్ తొట్టిలు పనిచేయడం, వర్మీకంపోస్టు తయారు చేసే పద్ధతులు, మొక్కల పెంపకం వంటి తదితర విషయాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల రిసోర్స్ పర్సన్ బి.చిన్ననాయుడు, మండల కో-ఆర్డీనేటర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో పంచాయతీలకు ఆదాయం



తంగేడులో సంపద కేంద్రాల వినియోగంపై శిక్షణ ఇస్తున్నఅధికారులు

కోటవురట్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు రాష్ట్రప్రభుత్వం వ్యర్థ పదార్థాలతో సంపద సృష్టి కేంద్రాలుగా తయారుచేసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఈవోపీఆర్డీ రాము సూచించారు. కోటవురట్ల మండలం తంగేడు గ్రామంలో తడిపొడి సంపద కేంద్రాల నిర్వహణపై పారిశుధ్య సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమంల నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 24 గ్రామపంచాయతీలో పరిధిలోని సంపద కేంద్రాలను ప్రజాప్రతినిధులు, పంచాయతీకార్యదర్శులు వినియోగంలో తీసుకువచ్చి తడిపొడి చెత్త సంపద ఉత్పత్తిని వర్మీకంపోస్టు ఎరువుగా తయారుచేసుకోవాలని సూచించారు. సేంద్రియ ఎరువు తయారీలో వానపాములు పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. వానపాములను బతికించుకుంటేనే నాణ్యమైన ఎరువు తయారవుతుందని చెప్పారు. తయారు చేసిన వర్మీకంపోస్టును పంటలకు ఎరువుగా రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. అలాగే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. సంపద కేంద్రాలు వినియోగంలోకి వచ్చేలా కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణచేయాలని వారు సూచించారు.

విద్యార్థులతో పనులు చేయించడంపై విచారణ

▸▸ 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎలమంచిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో పనుల చేయించడంపై గుట్టుచప్పుడు కాకుండా జిల్లా ఉప విద్యా శాఖాధికారి అప్పారావు విచారణ చేపట్టారు. విద్యార్థులతో పనులు శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు స్పందించారు. మంగళవారం డీవైఈవో పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న రెండు స్కూళ్లను సందర్శించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. విద్యార్థులను ప్రశ్నించి పలు వివరాలు రాబట్టినట్టు సమాచారం. అయితే స్కూలు సిబ్బంది చేయాల్సిన పనులను విద్యార్థులతో చేయించడం చర్చనీయాంశంగా మారింది. అలాగే ఈ విచారణ విషయం బయటకు పొక్కనీయకుండా గోప్యత పాటించడంలో అంతర్యం ఏమిటో అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై డీవైఈవో అప్పారావును ఫోన్‌లో ప్రస్తావించగా, పత్రికలో వచ్చిన కథనంపై విచారణ చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని సమాధానమిచ్చారు.

పరదేశమ్మ పుట్టుక వేడుక



పూజలందుకుంటున్న అమ్మవారు

మునగపాక, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపరదేశమ్మ అమ్మవారి ఆవిర్భావ వేడుక సంప్రదాయబద్ధంగా జరిగింది. పంచాయతీ పాలకవర్గం, టెక్కలి కుటుంబీకులు కలిసి ఈ వేడుకను సోమవారం అర్ధనుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. టెక్కలి కుటుంబీకులు సావిడి నుంచి ఊరేగింపుగా వెళ్లి సంతబయలు వద్ద ఆచారం ప్రచారం పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

నక్కపల్లి/పాయకరావుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని పలు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు మంగళవారం ఉల్లాసంగా... ఉత్సాహంగా జరిగాయి. నక్కపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రాణీలలిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. సంప్రదాయ నృత్యాలతో పాటు ఉర్రూతలూగించిన పలు డాన్స్‌లతో అదరగొట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల చైర్మన్ అద్దూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ లోవకన్నబాబు, ఉపాధ్యాయులు టీవీ.రమణ, సత్యవతి, డి.శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అదే విధంగా పాయకరావుపేట పట్టణంలోని ఉన్నత పాఠశాలల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

అడ్డరోడ్డులో గుడ్లు, చికెన్ మేళా

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడ్డులో మంగళవారం ఓ చికెన్ దుకాణం వారు కోడి గుడ్లు, చికెన్ మెగా మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. వేంకటేశ్వర హేచరీస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ మేళాలో వినియోగదారులకు ఉచితంగా ఉడకబెట్టిన కోడి గుడ్లు, వండిన చికెన్‌ను పంపిణీ చేశారు. ప్రజల్లో చికెన్ వినియోగంపై ఉన్న అపోహలు పోగొట్టడం కోసమే ఈ మేళా ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

కల్యాణపులోవ ఉత్సవాలు పక్కాగా నిర్వహించాలి: ఎమ్మెల్యే రాజు

రావికమతం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కల్యాణపులోవ ఉత్సవాలను పక్కాగా నిర్వహించాలని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. మంగళవారం ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖాధికారులతో ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దర్శనాల వద్ద తొక్కిసలాటకు అస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులతో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అధికారులంతా ఈ ఏడాది ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజా ప్రతినిధులు ఉత్సవాల్లో పాల్గొనడం లేదని, అధికారులే సమన్వయంతో పనిచేస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యులు బంటు శ్రీను, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, బదిరి చినబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి తీర్థం



విజేతలకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

చీడికాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగోగాడ గ్రామంలో మంగళవారం అభయాంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 9 గంటలకు మండల స్థాయి ముగ్గులు, ప్రభుత్వ పాఠశాలలో క్విజ్, సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు బహుమతులు అందజేశారు. సర్పంచ్ కొల్లి సూరినాయుడు, ఆంజనేయ స్వామి ఉత్సవ కమిటీ సభ్యులు అద్దేపల్లి చినఅప్పారావు, బల్లి కుమార్, అదత్రాపు రామారావు, పడాల కన్నంనాయుడు, గ్రామ పెద్దలు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

వైద్యాధికారి హరిప్రవీణ్‌కు సత్కారం



డాక్టర్ హరిప్రవీణ్‌ను సత్కరిస్తున్న పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో ఐదేళ్లుగా పనిచేస్తున్న వైద్యాధికారి ఎస్.హరిప్రవీణ్‌కు మంగళవారం ఘనంగా సత్కరించారు. విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాలలో పీజీ సీటు రావడంతో వైద్యాధికారిణి ఎస్.గాయిత్రి ఆధ్వర్యంలో అభినందనల సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు హరిప్రవీణ్‌కు దుశ్శాలువలు కప్పి సన్మానించారు. డాక్టర్ హరిప్రవీణ్ రోగులకు అంకిత భావంతో సేవలు అందించారని వక్తలు కొనియాడారు. ఈ ఐదేళ్ల ఇక్కడ సేవలు అందించడంలో సహచర వైద్యులు, సిబ్బంది అందించిన సహాయ సహకారాలు మరువలేనని సన్మాన గ్రహీత హరిప్రవీణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, డౌనూరు, చీడిగుమ్మల పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, కీర్తి, వరప్రసాద్, మధుసూదన్‌రావు, ధనంజయ్, ఆర్అండ్‌బీ రిటైర్డ్ ఈఈ కేశవరావు, రిటైర్డ్ హెచ్ఎం జి.రత్నాజీ, పీహెచ్ఎన్‌లు సావిత్రి, సత్యనారాయణ, హెచ్‌వీలు వరలక్ష్మి, లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలు

చీడికాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురువోలు గ్రామంలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి గుర్రం పరుగు పోటీలను నిర్వహిస్తామని గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఈ పోటీలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభిస్తారని చెప్పారు. మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమలు అందిస్తామన్నారు. పోటీలో పాల్గొనే గుర్రం యజమానులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఖండివరం గ్రామంలో బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తామని టీడీపీ నేత ఎస్‌వీఎస్.నాయుడు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7661801442 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వరరాజు



పార్టీ నూతన కార్యవర్గ ప్రతినిధులు

చోడవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా పాకలపాటి వెంకటేశ్వరరాజు నియమితులయ్యారు. పట్టణంలో మంగళవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కందర్ప రమణమూర్తి, జిల్లా కార్యదర్శి డి.రాజేశ్ ఆధ్వర్యంలో మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా కొల్లి వెంకట నాగసత్యారావు, కోశాధికారిగా గాలి శ్రీనివాసరావు నియమితులయ్యారు. అలాగే మరి కొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మను గెలిపించాలి'

రోలుగుంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్‌రాజు పిలుపునిచ్చారు. రోలుగుంటలో కూటమి మంగళవారం నాయకులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అత్యధికంగా 48 ఓట్లు ఉన్నాయని, అవన్నీ కూటమి మద్దతు అభ్యర్థికే పడేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలోటీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, రోలుగుంట ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలోనే సమస్యల పరిష్కారం'

నాతవరం: కూటమి ప్రభుత్వంలోనే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వీరసూర్యచంద్ర చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.రఘువర్మకు మద్దతుగా మంగళవారం నాతవరం, గునుపూడిలో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో 623 ఓట్లు ఉన్నాయని, వీరందరూ రఘువర్మకు వేసేలా చూడాలని ఆయన కోరారు. మాజీ ఎంపీపీ పి.కొండబాబు, జనసేన మండల అధ్యక్షులు వి.వెంకటరమణ, నాయకుడు వి.నరసింహం పాల్గొన్నారు.

ఇరుకు మార్గాలు.. ప్రయాణానికి పాట్లు!

- మాడుగులలో చిన్న రోడ్లలోనే భారీ వాహనాల రాకపోకలు
- వీధుల్లో కార్యాలయాలతో సమస్య మరింత జఠిలం
- రోడ్లపైనే వాహనాల పార్కింగ్... ట్రాఫిక్‌తో నరకం
- పట్టించుకోని అధికారులు, పాలకులు... ప్రజల అగచాట్లు

మండల కేంద్రంలో ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఎదురెదురు వాహనాలు కూడా తప్పించుకోలేని విధంగా ఉండే ఈ మార్గాల్లో లారీలు రాకపోకలు సాగిస్తుండడం... వీధుల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉండడం... చిన్న రోడ్లపై బైకులు పార్కింగ్ చేస్తుండడంతో సమస్య మరింత జఠిలమవుతోంది. దీంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు, వాహన చోదకులు ప్రత్యక్ష నరకం చవిచూడాల్సి వస్తోంది.





ఇరుకు రహదారిలో నుంచి వస్తున్న లారీ... ఇరు రోడ్డుపైనే పార్కింగ్ చేసిన వాహనాలు

మాడుగుల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

మాడుగుల గాంధీ పార్కు మీదుగా వెళ్లే ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో మండల పరిషత్ కార్యాలయం, జూనియర్ కళా శా ల, విద్యాశాఖ కార్యాలయం, జీసీసీ గోదాం, ఆర్‌డ బ్ల్యూఎస్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉంది. దీనివల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బందీ లేదు. అయితే, కార్యా ల యాలకు, కోర్టుకు వెళ్లే ఇరుకు మార్గంలో ప్రైవేట్ భవనాలు అద్దెకు తీసుకుని పో స్టాఫీసు, యూనియన్ బ్యాంక్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చే ప్రజలు వాహనాలను నిలిపేస్తున్నారు.

దీంతో మండల పరిషత్ కార్యాలయంతో పాటు కళాశాలకు, జీసీసీ గోదాం, కోర్టుకి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో గ్రామాల నుంచి రోగులు అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీనికితోడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం జనసందోహంతో నిండి ఉంటుంది. కొన్ని భూక్రయ, విక్రయదారుల మధ్య తగాదాలు నెలకొంటున్నారు. వీరి ఘర్షణలతో పరిసర ప్రాంత ప్రజలు అటుగా రాకపోకలు సాగించే వారికి సమస్య గా మారింది. ప్రతీ సోమవారం జరిగే సంత రోజు జనాలతో మరీ సమస్యాత్మకంగా ఉంటోంది. కనీస ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలను మార్పు చేసి ట్రాఫిక్ సమస్యను నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరుతడి పంటలకు ఊపిరి

కోనాం జలాశయం నీటి విడుదలతో కళకళలాడుతున్న నువ్వు, మినప, వేరుశనగ



ఏపుగా పెరిగిన వేరుశనగ పంట



కోనాం జలాశయం నుంచి విడుదలవుతున్న సాగునీరు



పూత దశకు చేరుకున్న నువ్వు పంట

చీడికాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆరుతడి పంటలకు కోనాం జలాశయం నుంచి విడుదల చేస్తున్న సాగునీటితో ఊపిరి పోసినట్టు అవుతోంది. గత రెండు నెలలుగా ఎటువంటి వర్షాలు కురవలేదు. ఈ నెల 7వ తేదీన చీడికాడతో పాటు పలు గ్రామాల్లో అకాల వ ర్షం కురిసింది. దీంతో ఆరుతడి పంటలకు కొంత మేర అనుకూలించింది. అనంతరం రైతుల కోరిక మేరకు కోనాం జలాశయం నుంచి ఎగువ కాలువకు పది క్యూసెక్కులు, దిగువ కాలువకి 30 క్యూసెక్కుల నీటిని పది రోజులుగా విడుదల చేస్తున్నారు. దీంతో వేరుశనగ, మినప పంటలు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం నువ్వుపంట పూతదశకు చేరుకుంది. మినప ముందుగా వేయడంతో జైతవరం, బైలపూడి, అప్పలరాజుపురం, ఖండివరం, ఎల్‌బి.పట్నం, బిసింగవరం తదితర గ్రామాల్లో పంటతీతపనులు సాగుతున్నాయి. మిగతా గ్రామాల్లో కాపుదశలో ఉన్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురియడం, పురుగుల తాకిడితోపాటు కోత దశలో రైతులు వరి పం టను నష్టపోయారు. దీంతో అపరాలపై రైతులు ఆశతో సాగుచేస్తున్నారు. కోనాం జలాశయ నీరు విడుదల కావడంతో పంటలకు అనుకూలిస్తుంది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఎ.కృష్ణవేణి మాట్లాడుతూ, మినుము మండలంలో 125 హెక్టార్లు, వేరుశనగ 35హెక్టార్లు, నువ్వు 30 హెక్టార్లులో సాగవుతుందన్నారు. ఈ పంటలు ఆశాజనకంగా ఉన్నట్టు వివరించారు.

10, 11 తేదీల్లో జాతీయ సదస్సు

చోడవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్రంలో నూతన పోకడల ద్వారా పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వచ్చే నెల 10, 11 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సదస్సు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. సదస్సుకు దేశంలోని ప్రముఖ సంస్థలైన ఐఐటీ, ఐఎస్ఈఆర్, ఎస్ఆర్ఎం యూనివర్శిటీల నుంచి శాస్త్రవేత్తలు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్లు లక్ష్మీ మంగమ్మ, రత్నభారతి, సుధీర్, వెంకటేశ్, రాధాకృష్ణ, సూర్యవతి, పిచ్చమ్మ, మాల్యాద్రి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

రావికమతం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లను కార్యదర్శులు వేగవంతం చేయాలని ఈవోపీఆర్‌డీ భానోజీరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్య సాధనపై పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.1.04 లక్షల పన్ను వసూలు లక్ష్యంకాగా, ఇంతవరకూ రూ.18 లక్షలు మాత్రమే వసూలైనట్టు చెప్పారు. గడువులోగా శతశాతం వసూలు చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే సంపద కేంద్రాలు నూరు శాతం వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఏవో సీతారామస్వామి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులను ఆదుకోవడం అభినందనీయం

నాతవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ముందుకురావడం అభినందనీయమని ఎస్ఐ సిహెచ్.భీమరాజు పేర్కొన్నారు. గునుపూడి గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన సాగర సింహచలం, నిండుగొండ మరినమ్మ కుటుంబాలకు నాసా సంస్థ సమకూర్చిన నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కొందరు వ్యక్తులు సాయమందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య, మాజీ సర్పంచ్ సుర్ల స్వామినాయుడు, నాసా సంస్థ సామాజిక కార్యకర్తలు శ్రీను, చిట్టిమూరి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పందెంరాయళ్ల అరెస్టు

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి శివారను ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా మంగళవారం నిర్వహిస్తున్న గుల్లాటలు, కోడి పందేల శిబిరాలపై దాడులు చేసినట్టు ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బంది దాడిచేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. కోడి పందాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోళ్లు, రూ.1420 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే గుల్లాటలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి రూ.3020లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చెరకు లోడుతో లారీ బోల్తా



బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రహదారిలో విజయరామరాజుపేట వంతెన వద్ద మంగళవారం చెరకు లోడుతో లారీ బోల్తా పడింది. వడ్డాది నుంచి గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు లోడుతో వెళుతున్న లారీ, వంతెన సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా లారీ నుంచి బయటకు దూకేయడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. చెరకు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సాదాసీదాగా మునిసిపల్ సమావేశం



సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్లు... సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి టీడీపీ నుంచి తొమ్మిది మంది, వైసీపీ నుంచి ఆరుగురు సభ్యులు హాజరయ్యారు. మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి అధ్యక్షత మంగళవారం నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా బడ్జెట్‌లో చేపట్టిన పలు అంశాలను తెలియజేశారు. అనంతరం వైస్ చైర్మెన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ మునిసిపాలిటీ పారిశుధ్యంపై ప్రచారం భారీ ఎత్తున చేస్తున్నదని, ఇక్కడ వీధుల్లో చూస్తే ఎక్కడపడితే అక్కడే చెత్త ఉంటుందని చెప్పారు. మునిసిల్ అధికారులు స్పందించి వార్డుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లాలన్నారు. అలాగే వార్డుల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

అనంతరం మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశం ముగిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏటా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించాలని సభ్యులను కోరారు. అలాగే బలిఘట్టంలో బుధవారం నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు సభ్యులు హాజరుకావలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, చింతకాయల రాజేశ్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జడ్జి వెంకటశేషమ్మ



సబ్ జైలులో రికార్డులు పరిశీలిస్తున్న శేషమ్మ

నర్సీపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వెంకటశేషమ్మ నర్సీపట్నం సబ్ జైలును సందర్శించారు. మంగళవారం జైలులోని రిమాండ్ ఖైదీలతో మాట్లాడి అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితి, భోజన సదుపాయంపై ఆరా తీశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఏ నేరాలు చేసి జైలుకు వచ్చారని ప్రశ్నించారు. అత్యధికంగా నాటుసారా నేరాలకు పాల్పడి జైలుకి వచ్చారని, అటువంటి తప్పులు మళ్లీ చేయవద్దని సూచించారు. అలాగే జైలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జైలర్‌కు ఆమె సూచించారు.

మోదకొండమ్మ తీర్థమహోత్సవం పోస్టర్ విడుదల

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్ రోడ్డు జంక్షన్‌లో గల మోదకొండమ్మ పాదాల తీర్థమహోత్సవం మార్చి రెండో తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ, వర్తక సంఘం, ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీర్థ మహోత్సవం సందర్భంగా ఆ రోజు అమ్మవారి పాదాలు వద్ద ప్రత్యేక కుంకుమపూజలు, అభిషేకాలు చేస్తామన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కార్యక్రమానికి ఎంపీ సీఎం రమేశ్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తిని ప్రత్యేకంగా ఆహ్వానిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కోట్ని సత్తిబాబు, పుట్టాబలరాం, పెచ్చెట్టి కొండలరావు, శ్రీను, నాని, చిన్న పాల్గొన్నారు.

ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గొలుగొండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు జాగ్రత్తలు వహించాలని ఎస్ఐ రామారావు పోలీసులను ఆదేశించారు. మండలంలోని పాతమల్లంపేటలో ఉమాధారమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఉమాధారమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే వాహనాల రాకపోకలపై పలు సూచనలు చేశామని ఆయన చెప్పారు.

ఇంటర్వ్యూ

నవోదయంతో గ్రామాల్లో మార్పులు

- కేవీపీ నాయుడు. ఎక్సైజ్ సీఐ, చోడవరం



ప్రభుత్వం ప్రారంభించిన నవోదయం కార్యక్రమంతో సారా తయారు చేస్తున్న గ్రామాల్లో గణనీయంగా మార్పులు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో నిర్వహిస్తున్న సమావేశాల ద్వారా సారా తయారీకి స్థానిక ప్రజలను దూరంగా ఉంచగలుగుతున్నాం. రెండు నెలల్లో 28 గ్రామాల్లో సమూలంగా మార్పులు తీసుకువస్తాం.

ప్రశ్న: సర్కిల్ పరిధిలో నవోదయం ఎన్ని గ్రామాలను గుర్తించారు?

సీఐ: 28 గ్రామాలు గుర్తించాం, చోడవరంలో ఒక గ్రామం, దేవరాపల్లిలో పది, కె.కోటపాడు మండలంలో ఎనిమిది, బుచ్చెయ్యపేట మండలంలో తొమ్మిది గ్రామాలు ఉన్నాయి.

ప్రశ్న: నవోదయం ద్వారా సారా తయారీనుంచి తొలగిన గ్రామాలు ఉన్నాయా?

సీఐ: నవోదయం కింద గుర్తించిన కె.కోటపాడు మండలం కొరువాడలో దాదాపుగా మార్పు తేగలిగాం, సారా తయారీ ఎక్కువగా సాగే ఆ పంచాయతీలో ఇప్పటి వరకూ స్థానికులలో మార్పు తేగలిగాం. 80 శాతం మేర సారా తయారీ నియంత్రించగలిగాం. మిగిలిన 20 శాతం కూడా సారా తయారీ నియంత్రించి శత శాతం ఫలితాలు సాధిస్తాం.

ప్రశ్న: నవోదయం గ్రామాల్లో లక్ష్యం ఏమిటీ?

సీఐ: నవోదయం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో దశలవారీగా లక్ష్యాలు పెట్టుకుని సారా తయారీ నియంత్రించాలని పనిచేస్తున్నాం. స్థానికులతో తరచుగా సమావేశాలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయిస్తున్నాం. బైండోవర్ కేసులు పెడుతున్నాం. వీటి వల్ల వారిలో చాలా మార్పు కనిపిస్తున్నది. చాలామంది నాటుసారా తయారీ విరమించుకున్నారు.

ప్రశ్న: గుర్తించిన గ్రామాలలో లక్ష్యం ఎప్పటిలోగా పూర్తవుతుంది?

సీఐ: సర్కిల్ పరిధిలోని ఒక మండలం తరువాత మరో మండలం పూర్తి చేయాలని లక్ష్యం. రెండు నెలల్లో 28 గ్రామాల్లో సమూలంగా మార్పులు తీసుకుని వస్తాం.

-చోడవరం, ఆంధ్రజ్యోతి

'కక్ష సాధింపులపై గణేశ్ మాట్లాడం ఆశ్చర్యకరం'

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కక్ష సాధింపుల గురించి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మాట్లాడడం ఆశ్చర్యకరంగా ఉందని జనసేన పార్టీ నర్సీపట్నం ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తాను అనేక సమస్యలపై మాట్లాడానని, దీంతో తన ఇంటి వద్ద పందిరిని కూల్చేశారని చెప్పారు. అలాగే తన ఫ్యాక్టరీ వద్ద అల్లర్లు సృష్టించలేదా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు. అభివృద్ధి కోసం పాటుపడే స్పీకర్ అయ్యన్నను విమర్శించే స్థాయి గణేశ్‌కు లేదన్నారు.

తడిపొడి చెత్త సేకరణపై శిక్షణ తరగతులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తామరం చెత్త సంపద కేంద్రం వద్ద గ్రామాల్లో తడిపొడి చెత్త సేకరణపై పంచాయతీ కార్యదరులు, పారిశుధ్య కార్మికులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. ప్రతీ గ్రామాంలో చెత్తసంపద కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. ప్రతీ ఇంటికి ప్రభుత్వం అందించే చెత్త బుట్టలను పంపిణీ చేయాలన్నారు. అనంతరం తామరం గ్రామం తడిపొడి చెత్తను పారిశుధ్య కార్మికులతో సేకరించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాల దొర, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మాకవరపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరిణించిన పింఛన్‌దారు హైమావతి కుటుంబ సభ్యులకు పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు నూకరాజు రూ.18 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రతి నెలా పింఛన్‌దారులు చెల్లిస్తున్న కొంత నగదును ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబానికి అందజేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అలాగే ప్రభుత్వం కూడా మరో రూ.25 వేలు అందిస్తుందన్నారు. సంఘం సభ్యులు వెంటకరాజు, శేషగిరిరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కోడి గుడ్లు, మాంసం పంపిణీ

దేవరాపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆటో స్టాండ్ వద్ద మంగళవారం కోడి గుడ్లు, మాంసం ఉచితంగా పంపిణీ చేశారు. వీటి కోసం జనం బారులు తీరారు. బర్డ్‌ఫ్లూ వందతులు నమ్మవద్దని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కలిగించారు. 70 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడిలో చికెన్, గుడ్లు తినడం సురక్షితమని చెప్పారు. కంపెనీ ప్రతినిధులు ఐ.వి.సత్యనారాయణరాజు, జామి నాయుడు, షేక్ కాదర్, రాజా పాల్గొన్నారు.



పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కల్యాణమహోత్సవంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

- కిటకిటలాడిన శివాలయాలు
- మహాశివ రాత్రి పూజలు ప్రారంభం

పాడేరురూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో శివాలయాలు మంగళవారం భక్తుల శివ నామ స్మరణతో మార్మోగాయి. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ ఆలయం నుంచి సంప్రదాయ బద్ధంగా మండల కేంద్రంలోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి పట్టు వస్త్రాలు, సారెను భారీ ఊరేగింపుగా ఆలయధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, కమిటీ ప్రతినిధులు తీసుకువెళ్లి ప్రధాన అర్చకులు ఉప్పల రామం పంతులకు అందించారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం నుంచి పూజలు, అభిషేక, హోమం తదితర కార్యక్రమాలను అంగరంగ వైభవంగా చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, ఉపసర్పంచి బూరెడ్డి రామునాయుడు, పూసర్ల గోపి, వెయ్యాకుల సత్యనారాయణ, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, బోనంగి వెంకటరమణ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పాడేరులోని స్వయంభూలింగేశ్వర, త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో రద్దీగా మారాయి. మండలంలోని మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో కొత్తగా స్ఫటిక శివలింగమూర్తిగా కొలువైన సిద్ధిసంగమేశ్వర ఆలయంలో శివరాత్రి మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. లోకకల్యాణం కాంక్షిస్తూ మంగళవారం ఉత్సవ విగ్రహాలను, పవిత్ర కలశాలు, 108 శివలింగాలకు పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో కోలాటం, థింసానృత్యాలు, మేళతాళాలతో సంగోడి గ్రామంలోని శివాలయం నుంచి ఊరేగింపును శోభా యాత్రగా నిర్వహించి మోదకొండమ్మకు నూతన వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి రమణమూర్తి దంపతులు, రిటైర్డ్ ఏవో చిరంజీవి పడాల్ దంపతులు, రొబ్బి శంకరరావు, ఆలయ నిర్వాహకులు బ్రహ్మకుమారీలు విజయ, శారద, శాంతి, సుమిత్ర, జయ, సంగోడి గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ఉమా నీలకంఠేశ్వరుని కల్యాణం

పాడేరు రూరల్: పాడేరులో ప్రముఖ శైవక్షేత్రమైన ఉమానీలకంఠేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు, పంచాయతీ సర్పంచి కొట్టగుల్లి ఉషారాణి, బొర్రా విజయరాణి, కె.సుబ్బారావు, వి.పిన్నయ్యదొర, ఐ.అనీల్‌కుమార్, ఆలయ కమిటీ, ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు, బక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు బౌడ శివాలయం ప్రత్యేక పూజలు



ఊరేగింపులో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

చింతపల్లి: మండలంలోని బౌడ శివాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు మళ్ల అప్పలనాయుడు, ఇందిరా, కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలో స్వామి వివేకనంద ట్రస్టు ప్రత్యేక ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తారన్నారు.ఈకార్యక్రమంలో అర్చకులు నగేశ్ శర్మ, గ్రామ పెద్దలు పొట్టిదొర, కన్నయ్యపడాల్, రాంబాబు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

నీలేరు, ఫిబ్రవరి 25: మహాశివరాత్రి మహోత్సవాలకు శివాలయాలను ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా సీలేరు శివాలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌ కర్యం లేకుండా ఆలయ కమిటీ అన్ని చర్యలు చేపట్టింది. దారకొండ గ్రామ శివార్లల్లో ఉన్న శివిఆలయంలో స్వయంభూగా వెలసిన రాతి శివలింగం, విగ్రహాలను, ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. ధారకొండలో మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



ధారకొండ ఆలయంలో శిలింగం, ఇతర విగ్రహాలు

పిచ్చి కుక్క స్వైర విహారం.. ఆరుగురికి గాయాలు



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వ్యక్తి

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సుమారు ఆరుగురిపై దాడి చేసి గాయపరిచింది. రాకపోకలు సాగిస్తున్న పాదచారులపై వెంట తరి మింది. స్థానికులు కుక్కను నిలువరించాలని ప్రయత్నించారు. దీంతో అక్కడినుంచి పరుగుతీసి వెళ్లిపోయింది. అనంతరం బాధితులు స్థానిక సీహెచ్‌సీకి వెళ్లారు. వైద్యాధికారి సంతోశ్ వైద్య సేవలను అందించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న లారీ

రెండు గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

పాడేరురూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గబ్బంగి గ్రామం వద్ద విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీ కొనడంతో సుమారు 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంది. పాడేరు-పెదబయలు ప్రధాన రహదారిలోని గబ్బంగి వద్ద ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ (మెయిన్ లైన్)స్తంభాన్ని లారీ ఢీ కొనడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వెంటనే గ్రామస్థులు విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి వైర్లను సరిచేశారు. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ఇంపాక్ట్ శిక్షణ పూర్తి



యువతికి సర్టిఫికెట్ అందిస్తున్న ప్రతినిధులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఇంపాక్ట్ ఉచిత శిక్షణను గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని ట్రైనర్ ఎస్.మాయావతి కోరారు. మంగళవారం 98వ బ్యాచ్ శిక్షణ ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ ట్రైనర్ గంపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు ఉచిత శిక్షణ పొంది ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. శిక్షణ పొందిన జిల్లా మహిళకు ఫౌండేషన్ ప్రతినిధులు, ఎల్.వేణుగోపాలరావు ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీఐ జాతీయ అధ్యక్షులు సోను శ్రీనివాసరావు, 4, 5 రీజన్‌ల అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, గిరిప్రసాద్, ట్రైనింగ్స్ జాతీయ డైరెక్టర్ ఆకుల ఉదయభాస్కర్ పాల్గొన్నారు. శిక్షణకు ఆ సక్తిగల మహిళలు ఫోన్: 7569750728ను సంప్రదించాలని ఆమె కోరారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కొయ్యూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకరపాడు గురుకుల కళాశాలలో మార్చి ఒకటో తేదీనుంచి జరుగనున్న ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్. జగనాధరావు తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 177 మంది, ద్వితీయ సంవత్సరానికి 148 మంది పరీక్షలు రాయనున్నట్టుగా తెలిపారు. ఇందుకు గానూ డిపార్టుమెంటల్ అధికారిగా చింతపల్లి ఏపీఆర్ కళాశాల ఇంగ్లీషు లెక్చరర్ ఎం. అ ప్పారావును నియమించారన్నారు. పరీక్షల నిర్వహణకు వీలుగా మూడు సెట్ల పేపర్లు వచ్చాయన్నారు. వీటిని పోలీసు స్టేషన్‌లో భ ద్రపరించారు.

ఎంఎస్ఎంఈ సర్వే వేగవంతం

- కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సూక్ష్మ చిన్న తరహా సంస్థల సర్వే వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో 11,279 సూక్ష్మ, చిన్న తరహా సంస్థల్లో 4,608 సంస్థలను సర్వే చేశారని మిగిలిన 6,671 సంస్థల సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వే సక్రమంగా చేయని ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉమ్మడి విశాఖ జడ్పీ సీఈవోను ఆదేశించారు. అలాగే మార్చి 8 నుంచి 18 వరకు పి4 సర్వే (పబ్లిక్ ప్రైవేటు పీపుల్స్ పార్టనర్‌షిప్) జరుగుతుందని, అందులో నిరుపేద కుటుంబాలను గుర్తించాలన్నారు. సచివాలయాల సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి, సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అలాగే పంచాయతీల్లోని చెత్త సేకరణపై ఆరా తీసి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. అలాగే ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్‌లో ఎంత మందిని చేర్పించారని అడిగి తెలుసుకున్నారు. సచివాలయం పరిధిలో ఉన్న విద్యావంతులైన నిరుద్యోగ అభ్యర్థులను నమోదు చేయాలని, ఆయా అభ్యర్థులకు ప్రభుత్వం రూ.5 వేలు ఉపకార వేతనం అందిస్తుందన్నారు. అలాగే అరకులోయ, చింతపల్లి డిగ్రీ కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంకల్పం పథకంలో సెల్ఫ్ డిఫెన్స్‌లో బాలికలకు శిక్షణ అందిస్తున్నామని, కౌమార దశ బాలికలకు నైపుణాభివృద్ధి శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోని దివ్యాంగులు సమీపంలోని సచివాలయాలకు వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ, రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహచలం, డీపీవో బి.లవరాజు, హౌసింగ్ పీడీ బి.బాబు, డ్వామా పీడీ విద్యాసాగర్, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి డి.వేణుగోపాలరావు, సీపీవో పట్నాయక్, గ్రామ వార్డు సచివాలయం నోడల్ అధికారి పీఎస్.కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి, జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం.వి.రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఘనంగా అవతార్ మెహర్ బాబా జయంతి



ప్రత్యేక పూజల్లో భక్తులు, గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అవతార్ మె హర్ బాబా 131వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయంతో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు బాబా సేవలును భక్తులకు వివరించారు. బాబాను దర్శించుకునేందుకు సీలేరు, జీకేవీధి, పాడేరు, నర్సీపట్నం ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమాధారన ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో టీడీటీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి, ఎంపీపీ కోరాబు అనుషదేవి, సర్పంచి దురియా పుష్పలత, వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, ఉపాధ్యాయుడు తాటిపాక రమేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు టి. పెద్దబ్బాయి, కార్యదర్శి బంగారయ్య శెట్టి, నిర్వాహకులు కోరాబు శాంతిప్రసాద్, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు పాల్గొన్నారు.

బేబీ ఫీడింగ్ రూమ్‌లు ఏర్పాటు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన గది వద్ద సీడీపీవో

పాడేరురూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పాడేరులోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన శిశువులకు పాలిచ్చే గదులను చంటి పిల్లల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో పి.ఝాన్సీరాణి కోరారు. మంగళవారం కలెక్టర్, ఐసీడీఎస్ పీడీ ఆదేశాలపై పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా ఆస్పత్రి, మూడు గ్రామ సచివాలయాలతో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బేబీ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా రాజుబాబుల పండగ

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గిరిజనులు సంప్రదాయబద్ధంగా రాజుబాబుల పండగను జరుపుకున్నారు. సంక్రాంతి తరువాత ఆదివాసీలంతా కలిసి స్థానిక రాజుబాబులకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. మంగళవారం ఆదివాసీలు ఈ పండగను జరుపుకుని సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆనందంగా గడిపారు.

'ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ గెలుపునకు సమష్టి కృషి'

కొయ్యూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కూటమి బలపరిచిన పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి కోరారు. ఈమేరకు పాడేరు నియోజకవర్గ అబ్జర్వర్ నారాయణ, పార్టీ మహిళా విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా విజయరాణి తో కలసి మంగళవారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు మేడిబోయిన చిన్న, సత్తిబాబు, మహిళ నేత సత్య తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఉపాధ్యాయ సంఘాలు, టీడీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించుకోవాలని పాడేరు టీడీపీ నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమెను సందర్శించి ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో నేతలు చల్లంగి జ్ఞానేశ్వరి, చల్లంగి లక్ష్మణరావు, కిల్లో పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, నాగంనాయుడు, మంగ్లు, హెచ్‌ఎం కొండలరావు పాల్గొన్నారు.

గుంట్రిగుడ: రఘువర్మకు మద్దతుగా స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సన్యాసిరావు ఆధ్వర్యంలో స్థానిక బాలురు ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ పాఠశాలలో ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షు సుబ్బారావు, మాజీ సర్పంచి సుబ్బారావు, చినగెన్ను, మాజీ ఎంపీపీ దన్నేరావు పాల్గొన్నారు.

పాడేరురూరల్: పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గూడ సర్పంచ్ కంబిడి జ్ఞానప్రకాష్, అండిభ సర్పంచ్ సత్యనారాయణ, పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. రఘువర్మకు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఎ ప్యానల్ వర్గం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు కూడా రాంబాబు, కోడా చిట్టిబాబు తెలిపారు.



కొయ్యూరులో ప్రచారం జరుపుతున్న ఈశ్వరి తదితరులు

పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

పెదబయలు: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి మద్దతుగా మంగళవారం సీకరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో గిరిజన సంఘం, సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు ప్రచారం చేశారు. ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, బొండా సన్నిబాబు, సాగిన ధర్మన్న పడాల్, గంగాధరం, జంపరంగి సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు

- ఎస్ఎస్ఏ పీవో డాక్టర్ స్వామి నాయుడు



విద్యార్థినులతో కూర్చుని భోజనాలు చేస్తున్న స్వామినాయుడు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో భోజనాలను మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఎస్ఎస్ఏ పీవో డాక్టర్ వి.ఎ.స్వామి నాయుడు సూచించారు. మండలంలోని కిలగాడ కేజీబీవీ పాఠశాల ఆవరణలో అదనపు తరగతి భవన నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎస్ఎస్ఏ పీవో డాక్టర్ వి.ఎ.స్వామి నాయుడు అన్నారు. మంగళవారం ఆయన ఆ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. పాఠశాలలో అమలు చేస్తున్న అడాప్టివ్ లెర్నింగ్ పైఅడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. వారితో పాటు ఆయన భోజనం చేశారు. నిత్యావసర సరకుల నిల్వ గదిని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి భవనాల నిర్మాణం పనులను పరిశీలించారు. దీనిపై ప్రిన్సిపాల్ సాయి ప్రసన్నను ఎస్ఎస్ఏ పీవో ప్రశ్నించారు. తాగు నూతనంగా విధులోకి చేరడం జరిగిందని ఆమె తెలిపారు. అదనపు భవనాల పనుల జాప్యంపై సమగ్ర శిక్షణ డీఈఈ ఆధ్వర్యంలో విచారణ చేపట్టేందుకు కమిటీ వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ప్రణాళికతో చదివితే ఉన్నత శిఖరాలు



ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పొలిటికల్‌సైన్స్ విభాధిపతి జోసఫ్ స్టీఫెన్

అరకులోయ, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులోఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు నిర్దిష్ట ప్రణాళిక అవసరమని వక్తలు అన్నారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్నత విద్యపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ క్యాంపస్‌కు చెందిన డాక్టర్ కె. జోసెఫ్ స్టీవన్ హెడాఫ్ ద డిపార్టుమెంట్ (పొలిటికల్‌సైన్స్) డాక్టర్ ఎం.గోపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (పొలిటికల్‌సైన్స్) వి.శ్రీనివాసరావు అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎకనామిక్స్) తదితరులు పీజీ కోర్సులు, ఇతర ఉన్నత చదువులకు అవకాశాలను వివరించారు. విద్యార్థులు వారికి నచ్చిన రంగాల్లో చేరాలన్నారు. అనంతరం ఇందుకు తగిన కృషి చేయాలన్నారు. స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఉన్నతమైన స్థానాలకు ఎదగాలంటే క్రమశిక్షణముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ నైతిక విలువలతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు కె.ధర్మారావు, కె. బాలరాజు, డాక్టర్ సుబాన్, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ లక్ష్మి, దివ్య, మౌనిక, ప్రణీత, సరస్వతి పాల్గొన్నారు.

గిరిజనులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



యువతతో ఐటీడీఏ పీఎంవో రామ్‌గోపాల్, గిరిజన వికాస్ సిఈఓ తదితరులు

చింతపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఎంవో ఆర్. రామ్‌గోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం సమావేశమందిరంలో గిరిజన వికాస్ ఆదివాసీ యువతకు గిరిజన చట్టాలు, పథకాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఎంవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఇప్పటికి ఆదివాసీలకు ఆధార్ కార్డులేక పథకాలు పొందలేకపోతున్నారు. ప్రతి ఒకరు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకాలు, కులం, ఆదాయం పత్రాలు కలిగి ఉండాలన్నారు. వారసత్వ భూములను కుటుంబ సభ్యులు మ్యూటేషన్ చేయించుకోవాలన్నారు.ఉపాధి పథకం, పక్కా గృహాలు పొందేందుకు జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు. గిరిజన వికాస్ సీఈవో నెల్లూరి సత్యనారాయణ మాట్లాడుతూ పెసా, అటవీహక్కులు, భుబదలాయింపు చట్టాలపై గిరిజనులు చైతన్యవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జి. శ్రీనివాసరావు, అజీం ప్రేం పీఎంయూ విభాగం ప్రతినిధి రమ్య, అనంత లక్ష్మి, గడుతూరి పోతురాజు పాల్గొన్నారు.

శీకాయ కొనుగోలుకు జీసీసీ చర్యలు: బీఎం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల నుంచి శీకాయను గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేయనున్నట్టు స్థానిక బ్రాంచి మేనేజర్ సరమండ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం శీకాయకు మార్కెటింగ్ సదుపాయంలేక గిరిజన రైతులు ఎదుర్కొంటున్న అవస్థలపై 'శీకాయ రైతు దిగాలు' శీర్షిక 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్థానిక జీసీసీ బ్రాంచి మేనేజర్ స్పందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శీకాయను ఈఏడాది జీసీసీ కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. తొలివిడతగా కిలోకి రూ.40 ధర ప్రకటించామన్నారు. వారం, పది రోజుల్లో రైతుల నుంచి శీకాయను కొనుగోలు చేస్తామని బీఎం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గుణాత్మకమైన పూర్వప్రాథమిక విద్య

చింతపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు బాలబాలికలకు గుణాత్మకమైన పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని పాడేరు సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో కె. భాస్కరరావు తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 120 డేస్ శిక్షణ ముగింపును పురస్కరించుని నిర్వహించిన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కార్యకర్తలకు ధ్రువపత్రాలందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో జీవీ రమణ, ఏసీడీపీవో రామలక్ష్మి, ఎంఈవో పనసల ప్రసాద్, ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు, హెచ్ఎం అప్పారావు, ప్రథమ కోఆర్డినేటర్ వెంకన్న, రిసోర్స్ పర్సన్స్ ఎంఎస్ఎన్ పాత్రుడు, దేపూరి శశి కుమార్, బి. మునిస్వామి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు : జేసీ అభిషేక్



పాడేరులోని బాలెట్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సూచనలిస్తున్న జేసీ

పాడేరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా కేంద్రం పాడేరులో ఏర్పాటు చేస్తున్న బ్యాలెట్ పంపిణీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ మంగళవారం రాత్రి సందర్శించారు. అక్కడ చేస్తున్న ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి పద్మలత, స్పెషల్ డిప్యూటీ క లెక్టర్ లోకేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎ న్నికల అధికారులు, సిబ్బందికి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని, సకాలంలో పోలింగ్ సామగ్రిని పంపిణీ చేయాలని జేసీ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాహసీల్ధార్ వి.త్రినాధరావునాయుడు,సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు సెక్టార్ అధికారి రహీం తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఓటర్లకు అవసరమైన సదుపాయాలు కల్పించామన్నారు. చింతపల్లి పోలింగ్ కేంద్రం పరిధిలో 185 మంది ఓటర్లు ఉన్నారన్నారు. రెవెన్యూ అధికారులు ఓటరు స్లిప్స్ అందజేశారన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ బి. రవి కుమార్ పాల్గొన్నారు.

శివరాత్రి పూజలకు సిద్ధం


తాడి ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం


ఆలయంలో శివలింగం

పరవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా శివాలయాలను శుభ్రం చేసి ముస్తాబు చేశారు. పరవాడలోని మల్లికార్జునస్వామి, తాడిలో ఉమా నీలకంఠేశ్వరస్వామి, కలపాక పంచాయతీ పరిధి పెదస్వయంభూవరంలోని స్వయంభూలింగేశ్వరస్వామి, భరణికంలోని శివాలయం, జీవీఎంసీ పరిధి దేశపాత్రునిపాలెంలోని ఉమా సహిత లింగేశ్వరస్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం ఆరు గంటల నుంచి ఆయా గ్రామాల్లోని శివాలయాల వద్ద రుద్రహోమం, మహాన్యాస రుద్రాభిషేకం, సహస్రనామార్చన, పాలాభిషేకం, కుంకుమ పూజలు చేస్తారు. తాడి, దేశపాత్రునిపాలెం శివాలయాల వద్ద రాత్రి 7 గంటల నుంచి దీపారాధన నిర్వహిస్తారు. ఉదయం 6 గంటల నుంచి తాడి నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కల్యాణలోవకు ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కల్యాణలోవకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ డీపీటీవో కె.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి డిపో నుంచి 30 బస్సులు, నర్సీపట్నం నుంచి 45 బస్సులు బుధవారం వేకువజాము నాలుగు గంటల నుంచి గురువారం సాయంత్రం వరకు బస్సులు నడపనున్నామన్నారు. అదేవిధంగా ధారమఠానికి నర్సీపట్నం డిపో నుంచి 15 బస్సులు నడుపుతామన్నారు. అనకాపల్లి డిపో నుంచి పుణ్యగిరికి పది బస్సులు నడపనున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు వెంకుపాలెంలో తీర్థం


బాల పేరంటాలు లక్ష్మణమ్మతల్లి

కొత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వెంకుపాలెంలో ఉన్న బాల పేరంటాలు లక్ష్మణమ్మతల్లి 47వ తీర్థ మహోత్సవం బుధవారం జరగనుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభం కానున్న ఈ మహోత్సవం మూడు రోజులు జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శారదా బ్రిడ్జి నుంచి గ్రామ వీధుల్లో ఊరేగిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన, సాయంత్రం వెంకటేశ్వర బృందం వారితో భైరో భజన కార్యక్రమం గురువారం తెల్లవారుజాము వరకు జరుగుతుందన్నారు. 27న అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని తెలియజేశారు. 28న సాయంత్రం 4 గంటలకు ముగ్గుల పోటీ, 5 గంటల నుంచి గ్రామ స్థాయి షటిల్ పోటీలు ఏర్పాటు చేశామని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా అమ్మవారి అనుపోత్సవం

సబ్బవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పైడివాడలో గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి అనుపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారిని దర్శించుకొని దూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం కోలాటం, చిటికెల భజనలు, నేల డ్యాన్స్‌లు, బాణసంచా పేలుళ్లతో అమ్మవారి ఊరేగింపు అనంతరం అనుపోత్సవం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. లగిశెట్టిపాలెంలో సీతారామల తీర్థ మహోత్సవం, అయ్యన్నపాలెం శివారు రాపర్తివానిపాలెంలో ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు/ఉత్సవ కమిటీ సభ్యులు దాసరి వెంకటరమణ, వడ్డాది అప్పలరాజు, సీరం అప్పలరాజు, పాలిశెట్టి సురేశ్‌రాజ్, పాలిశెట్టి పార్వతి, బుదిరెడ్ల కనకరాజు, దాసరి రామకృష్ణ, తుంపాల నానాజీ పాల్గొన్నారు.

వైభవంగా పరదేశిమాంబ అమ్మవారి పండగ

పరవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పరవాడ ప్రజల ఆరాధ్య దైవం పరదేశిమాంబ అమ్మవారి పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, కూటమి నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా సురేష్, గండి నమోబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలు గ్రామ వీధుల్లో ఊరేగించి అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


పరదేశమ్మ


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, శ్రీనివాస్ దంపతులు, నాయకులు

పిచ్చి కుక్క స్వైర విహారం.. ఆరుగురికి గాయాలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సు మారు ఆరు గురిపై దాడి చేసి గాయపరిచింది. రాకపోకలు సాగిస్తున్న పాదచారులపై వెంట తరి మింది. స్థానికులు కుక్కను నిలువరించాలని ప్రయత్నించారు. దీంతో అక్కడినుంచి పరుగుతీసి వెళ్లిపోయింది. అనంతరం బాధితులు స్థానిక సీహెచ్‌సీకి వెళ్లారు. వైద్యాధికారి సంతోశ్ వైద్య సేవలను అందించారు.

ఈవీఎంల గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయం ప్రాంగణంలోని ఈవీఎంల గోదామును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ అయిషా, జిల్లా అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ నాయుడు పాల్గొన్నారు.

మద్యంతో దొరికితే రూ.5 లక్షల జరిమానా

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్


సబ్బవరంలో మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

సబ్బవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సబ్బవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలను బంద్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ సబ్బవరం మండలంలో 8 మద్యం షాపులు, పరవాడ మండలంలో 14, రెండు బార్లు బంద్ చేసి సీల్ వేశామన్నారు. 27న సాయంత్రం ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత షాపులు తెరుచుకోవచ్చన్నారు. ఎక్కడైనా బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ దొరికితే సంబంధిత షాపు యజమానికి రూ.5 లక్షలు జరిమానా విధిస్తామన్నారు. రెండోసారి పట్టుబడితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఫార్మా పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఫార్మా పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. ఫార్మాసిటీలోని ఎంఏఎస్ఆర్ఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల నివారణపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. 'జీరో యాక్సిడెంట్' నినాదంతో ప్రతి యాజమాన్యం పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు, ఎస్‌వోహెచ్‌ఎస్ అధ్యక్షుడు రామ సుబ్బారావు, జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన ఫార్మా కంపెనీల ఉద్యోగులు, కార్మికులు

సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలి


తాళ్లపాలెంలో వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

కశింకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి సూచించారు. మంగళవారం మండలంలోని బయ్యవరం, తాళ్లపాలెం గ్రామాల్లో సంపద కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ కేంద్రం పరిసరాల్లో ఉన్న మొక్కలు, తొట్టెలు, వర్మీ కంపోస్టు తదితర వాటిని పరిశీలించి పంచాయతీ కార్యదర్శులు సత్యారావు, బాబూరావులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించి పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులను కార్యదర్శులు పర్యవేక్షించి కాలువలు, చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని సూచించారు. ఆమె వెంట ఈవోపీఆర్‌డీ మోర్ల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి 200 బస్తాల సిమెంట్ వితరణ


నగదు అందిస్తున్న దొడ్డి వెంకట అప్పారావు

సబ్బవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సబ్బవరంలో నిర్మాణంలో ఉన్న శివాలయానికి స్థానికులు దొడ్డి వెంకట అప్పారావు 200 సిమెంట్ బస్తాలు వితరణగా చేశారు. ఆయనకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాశ్, ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, బర్ల రమణ, కోరాడ రమేశ్, ముర్రు కనకరాజు కృతజ్ఞతలు తెలిపారు.

స్టైఫండ్‌కు దరఖాస్తులు చేసుకోండి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 2025-26 సంవత్సరానికి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు స్టైఫండ్ ఇవ్వనున్నందున, దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎల్‌వీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 20 ఏళ్ల వయసు గల గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు స్టైఫండ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. పురుషులు ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్, మహిళలు, పురుషులు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు మార్చి 6లోపు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులతో ఆన్‌లైన్‌లో డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎఫ్‌సీఐ.జీఓవి.ఇన్‌కు దరఖాస్తులు చేసుకోవాలని రమణ కోరారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


అన్న సమారాధనలో పాల్గొన్న నాయకులు

కశింకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకివానిపాలెంలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, దొడ్డి నాగేశ్వరరావు, కాయల మురళీ, ద్వారపురెడ్డి సత్తిబాబు తదితరులు సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వీరిని శాలువాతో సత్కరించారు.

గురుకుల విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ


బాలికకు కళ్లజోడు పెడుతున్న వైద్యాధికారిణి మనీషా

కశింకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు మంగళవారం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్యాధికారిణి డాక్టర్ మనీషా మాట్లాడుతూ గతంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న బాలబాలికల్లో అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశామని తెలిపారు. ఆప్తాలమిక్ అధికారి సి.హెచ్.ప్రసాద్, ఆరోగ్య బోధకుడు దృష్టిలోపం రాకుండా విటమిన్-ఎ, పోషకాలు అందాలంటే ఆకుపచ్చని కాయగూరలు, బొప్పాయి, జామ, ఉసిరి తదితర వాటిని తరచూ తీసుకోవాలన్నారు. 69 మంది బాలికలకు కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.గ్రేస్, ఆరోగ్య పర్యవేక్షకుడు నరసింహారావు, ఆరోగ్య రాయబారి బి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులు కావాలి

ప్రిన్సిపాల్ ఆకాంక్ష


సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు

కొత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు పాల్గొని ప్రతి విద్యార్థీ ఇంటర్ పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో వివిధ విభాగాధిపతులు విక్టర్, హరిబాబు, లెఫ్టినెంట్ కొండలరావు, ఫిజికల్ డైరెక్టర్ స్వామినాయుడు, సూపరింటెండెంట్ పెంటకోట అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక కోసం చివరి రోజు జోరుగా ప్రచారం


యూటీఎఫ్ నాయకులతో కలిసి పరవాడలో ప్రచారంలో పాల్గొన్న పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని విజయగౌరి


పరవాడలో ఉపాధ్యాయులకు కరపత్రం అందజేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న కూటమి నాయకులు


ప్రశాంతినికేతన్ స్కూలులో ప్రచారం చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

పరవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలో దిగిన కోరెడ్ల విజయగౌరి ప్రచారానికి చివరి రోజైన మంగళవారం పరవాడలో విస్తృతంగా పర్యటించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక బాలురు, బాలికోన్నత పాఠశాలల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆమె వెంట పీడీఎఫ్, యూటీఎఫ్ నాయకులు ప్రకాశ్, రాము, పార్వతి పాల్గొన్నారు.

పాకలపాటికి మద్దతుగా..

పరవాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా కూటమి నాయకులు మంగళవారం పరవాడలో ప్రచారం చేశారు. దీనిలో భాగంగా స్థానిక బాలికల పాఠశాలకు వెళ్లి రఘువర్మకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు లక్ష్మణరావు, జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, సర్పంచులు శిరపురపు అప్పలనాయుడు, మోటూరి సన్యాసినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రఘువర్మను గెలిపించండి: పీలా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి పార్టీలు బలపర్చిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రఘువర్మను గెలిపిస్తే మండలిలో కూటమి బలం పెరుగుతుందని వివరించారు. బ్యాలెట్ పేపరులోని సీరియల్ నంబరు-7లో రఘువర్మకు ఓటు వేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, మాదంశెట్టి నీలబాబు, పోలావరపు త్రినాథ్, కర్రి బాబి, కొణతాల రత్నకుమారి పాల్గొన్నారు.

అనకాపల్లిలో జనసేన నేతల ప్రచారం

కొత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ గెలుపునకు జనసేన నేతలు మంగళవారం ప్రచారం చేశారు. అనకాపల్లిలోని డీఏవీ పబ్లిక్ స్కూలు, డీవీఎన్ కాలేజీ, ప్రశాంతి నికేతన్, విశ్వశాంతి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఏకైక వ్యక్తి రఘువర్మ అన్నారు. జనసైనికులు ఎన్.వి.కృష్ణ, పీలా నాగశ్రీను, ఆళ్ల రామచంద్రరావు, మంగాతఈశ్వర్, దూలంగోపి, విల్లూరి హరి, అప్పికొండగణేష్, బర్నికానరాము, యల్లపు శ్రీను, దాడి బుజ్జి, బొడ్డేడ సంతోష్, కాండ్రేగుల ఉమా, బండారి వెంకటేష్ పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి'


అరిపాకలో శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు

సబ్బవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు ఎస్.లక్ష్మణరావు, జె రవీంద్రబాబు సూచించారు. మండలంలోని పలు పాఠశాలల్లో వారం రోజులుగా జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈవోలు మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తలే తల్లిలా వ్యవహరిస్తూ పిల్లలకు ఆటపాటలతో విద్యాబోధన చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో ఆటపాటలతో విద్యాబోధన చేపట్టడం ద్వారా భయం వీడి ప్రతి పిల్లవాడు చదువు పట్ల ఆసక్తి కనబరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీఎస్ ఎన్. అప్పలనాయుడు, జి.టి.సూరిబాబు, అంగన్వాడీ సూపర్‌వైజర్ జి పైడితల్లి, కోర్సు డైరెక్టర్, హెచ్‌ఎం రాధాకుమారి, సర్పంచి పాలిశెట్టి పార్వతి, సీఆర్ఎంటీలు ఎన్.కళాభారతి, ఆర్.రమణ పాల్గొన్నారు.

రైతు విశిష్ఠ గుర్తింపు సంఖ్య నమోదు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం సచివాలయంలో మంగళవారం రైతు విశిష్ఠ గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ సాలాపు శాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలాపు సూరి అప్పారావు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


హోంగార్డు భార్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన గవ్వ బాబురావు కుటుంబానికి తోటి హోంగార్డులు ఆర్థికంగా అండగా నిలిచారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు తమ ఒక రోజు వేతనం రూ.4,12,140 సొమ్మును జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా చేతుల మీదుగా బాబురావు భార్య వీరలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అనారోగ్యంతో ఒక హోంగార్డు మృతిచెందితే సహచర ఉద్యోగులంతా ఒక రోజు వేతనాన్ని వితరణ చేయడం అభినందనీయమని అన్నారు.

తండ్రి చితికి తనయ తలకొరివి


తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె

ఎలమంచిలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓ తనయ తన తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. ఈ సంఘటన పట్టణంలోని అయోధ్యపురి కాలనీలో మంగళ వారం చోటు చేసు కుంది. కాలనీకి చెందిన మళ్ల సత్యనారాయణ, భార్య లక్ష్మి, కుమార్తె రమణితో నివాసం వుంటున్నారు. సోమవారం రాత్రి ఆయన బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందాడు. ఈ దంపతులకు ఒక్కటే కుమార్తె కావడంతో మంగళవారం రమణి తన తండ్రి చితికి నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించింది.

స్పీకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేతపై కేసు

నర్సీపట్నం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడుపై అభ్యంతకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసరావుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. శారదానగర్ మెయిన్ రోడ్డులో వైసీపీ నాయకుడు కర్రి శ్రీనివాసరావు అన్నయ్య సత్యనారాయణకు చెందిన భవనం ప్రభుత్వ స్థలంలో ఉందని తహసీల్దార్ సోమవారం కూల్చివేత పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కర్రి శ్రీనివాసరావు స్పీకర్ అయ్యన్నపాత్రుడుని ఉద్దేశించి అభ్యంతకర వ్యాఖ్యలు చేశారు. దీనిపై 24వ వార్డు కౌన్సిలర్ దనిమిరెడ్డి మధుబాబు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిని చంపుతానని బెదిరించడం, పరువుకి భంగం కల్గించడంపై పట్టణ సీఐ గోవిందరావు కింద కేసు నమోదు చేశారు.

పూరిపాకను ధ్వంసం చేసిన 9 మందిపై కేసు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం పల్లావూరు గ్రామంలో పల్లా చిన్న అలియాస్ దేముడు పూరిపాక ను ధ్వంసం చేసిన ఆ గ్రామానికి చెందిన 9 మందిపై కేసు నమోదుతోపాటు 20మందిని తహసీల్దార్ వద్ద బైండవర్ చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. సీహెచ్.నాగాపురం పంచాయతీ శివారు పల్లావూరులో సుమారు పది సెంట్లు స్థలానికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో గ్రామస్థులు కొంతమంది సోమవారం సాయంత్రం పల్లా చిన్నా అలియాస్ దేముడు పూరిపాకను ధ్వంసం చేశారని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సంఘటనలో 9మందిపై పూరిపాక ధ్వంసం కేసుతోపాటు మరో 20మందిని బైండోవర్ చేశామన్నారు. స్థల వివాదం జరగకుండా పల్లావూరులో పికెట్ ఏర్పాటు చేశామని, సంఘటనపై మరింత దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు పూర్తిచేయాలి

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు అవుతున్న పంటలను శత శాతం ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలో 32 వేల ఎకరాలకుగాను ఇంతవరకు సుమారు 27 వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యిందని, ఈ నెలాఖరులోగా నూరు శాతం నమోదు చేయాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంవలో జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, డివిజన్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

» ఉత్తరాంధ్ర పరిధిలో 22,493 మంది ఓటర్లు
» ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్


ఎన్నికల ఏర్పాట్లను వివరిస్తున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు యంత్రాంగం సర్వ సన్నద్ధమైందని, ఏర్పాట్లు పూర్తి చేశామని విశాఖ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయం త్రం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికలకు సంబం ధించిన వివరాలను వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని 22,493 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు వెల్లడిం చారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, షామియానాలు, మహిళలు, పురుషుల కు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌కు 48 గంటలు ముందుగానే సైలెంట్ పీరియ డ్ అమల్లోకి వస్తుందని, ఈ సమయంలో ఎవరూ ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరించకూడదని, ప్రచారం చేయరాదన్నారు. అదే సమయంలో 144 సెక్షన్ కూడా అమల్లో ఉంటుందన్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ ఉంటుందన్నారు.

123 పోలింగ్ కేంద్రాలు

ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో మొత్తం 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ విధిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు 739 మంది అధికారులను నియమించామన్నారు. వీరిలో 148 మంది పీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారన్నారు. వీరితోపాటు మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లలో 13,508 మంది పురుష ఓటర్లు, 8,985 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటికే ఓటరు స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలు వద్ద వీల్ చైర్లు సమకూర్చామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 31, విజయనగరం జిల్లాలో 29, పార్వతీపురం మన్యం జిల్లాలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విశాఖపట్నం జిల్లాలో 13, అనకాపల్లి జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా శ్రీకాకుళం జిల్లాలో 5,035 మంది ఓటర్లలో మహిళలు 1,619 మంది, పురుషులు 3,416, విజయనగరంలో జిల్లాలో 5,223 మందిలో పురుషులు 3,270, మహిళలు 1,953 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,333 మంది ఓటర్లుండగా, పురుషులు 1,574, మహిళలు 759 మంది ఉన్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,488 మంది ఓటర్లకు గాను 920 మంది పురుషులు, 568 మంది మహిళలు, విశాఖ జిల్లాలో 5,529 మంది ఓటర్లకు 2,539 మంది పురుషులు, 2,990 మంది మహజిళలు, అనకాపల్లి జిల్లాలో 2,885 మంది ఓటర్లలో పురుషులు 1,789 మంది, మహిళలు 1,096 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు.

ఉదయం 8 గంటల నుంచి పోలింగ్

ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మార్చి మూడో తేదీన కౌంటింగ్ జరుగుతుందని, ఎనిమిదో తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగిస్తుందని వివరించారు. ఈ నెల 26వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ అందిస్తామన్నారు. 27వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది నుంచి మెటీరియల్ స్వీకరిస్తామన్నారు. బయటి ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఈ పరిధిలో ఉండకూడదని, పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకువెళ్ల కూడదన్నారు. హోటళ్లు, లాడ్జిలు, ఫంక్షన్‌హాల్స్‌లో ముందస్తు తనిఖీలు చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఆర్‌వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్, తూర్పు ఏసీపీ మూర్తి పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ లేదు

» చికెన్, కోడిగుడ్లు నిర్భయంగా తినొచ్చు
» కలెక్టర్ విజయకృష్ణన్.. అనకాపల్లిలో చికెన్, ఎగ్ మేళా


చికెన్, ఎగ్ పంపిణీ కౌంటర్ల వద్ద బారులు తీరిన ప్రజలు జనాలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు లేవని పశుసంవర్ధక శాఖ అధికారులు ధ్రువీకరించారని, అందువల్ల ప్రజలు చికెన్, కోడిగుడ్లను నిర్భయంగా తినవచ్చని కలెక్టర్ విజయకృష్ణన్ భరోసా ఇచ్చారు. పిలుపునిచ్చారు. జాతీయ గుడ్ల సమన్వయ కమిటీ(నెక్) సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన చికెన్, ఎగ్ మేళా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు యథావిధిగా కోడిగుడ్లు సరఫరా చేయడమే కాకుండా వాటిని తీసుకొనే విధంగా విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కోడిగుడ్లు, చికెన్ వినియోగ అవగాహనపై పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం చికెన్, కోడిగుడ్లతో చేసిన ఆహార పదార్థాలను ఆరగించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.రామ్మూర్తి, నెక్ జాతీయ కమిటీ సభ్యుడు భరణికాన రామారావు, పౌల్ట్రీ రంగ ప్రతినిధి మందపాటి జానకిరామరాజు, ఆర్డీవో షేక్ ఆయాషా, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి.రామమోహన్‌రావు, డీఎస్పీ ఎం.శ్రావణి, నెక్ జిల్లా చైర్మన్ టి.శ్రీధర్, అనకాపల్లి చైర్మన్ కె.గంగిరెడ్డి, ఏపీ కోళ్ల సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షుడు బి.సాయినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

కాగా ఎన్టీఆర్ స్టేడియంలో నెక్, పౌల్ట్రీ రంగ ప్రతినిధులు ఏర్పాటు చేసిన చికెన్, ఎగ్ మేళాకు పట్టణవాసుల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 20 కౌంటర్లును ఏర్పాటు చేశారు. ఒక్కొక్కరికి చికెన్ ఫ్రై, ఉడకబెట్టిన కోడిగుడ్డుతోపాటు మంచినీటి బాటిల్‌ను ఉచితంగా అందజేశారు.

128 కిలోల గంజాయితో ఆరుగురి అరెస్టు



పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీస్ అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసులు అనకాపల్లి మం డలం తుమ్మపాల సమీ పంలో ఏలేరు కాలువ వద్ద 128 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆరుగురిని అదుపులోకి తీసుకు న్నారు. మూడు వాహనాలను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి మంగళ వారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా పాలకోడ్ ప్రాంతానికి చెందిన విజయ్‌మాధప్పన్, అరవిందన్ దాసన్ గంజాయి వ్యాపారం చేస్తుంటారు. అల్లూరి జిల్లా సరిహద్దులోని ఒడిశా ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి, అనకాపల్లి జిల్లా మైదాన ప్రాంతానికి చేర్చడానికి బుచ్చెయ్యపేట మండలం విజయరామరాజుపేటకు చెందిన కోరిబిల్లి రమణబాబు, మాడుగుల మండలం సత్యవరం గ్రామానికి చెందిన గొన్నాబత్తుల సంతోష్‌కుమార్ వీరికి సహకరిస్తుంటారు. ఈ నేపథ్యంలో నలుగురూ కలిసి సోమవారం రాత్రి ఆటో, కారు, బొలేరో వాహనాల్లో ఎం.కోడూరు వెళ్లారు. అక్కడ గుమ్మాల నరసింగరావు, గొల్లవిల్లి దుర్గాప్రసాద్‌లను కలిసి అప్పటికే సిద్ధంగా వుంచిన 64 ప్యాకెట్లలో ఉన్న 128 కిలోల గంజాయి సేకరించారు. వీటిని వాహనాల్లో లోడింగ్ చేసుకుని, మంగళవారం ఉదయం అంతా కలిసి వాహనాల్లో అనకాపల్లి వైపు బయలుదేరారు. ఈ సమాచారం పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్‌కు అందింది. వెంటనే అప్రమత్తమైన ఆయన పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు, పోలీసు సిబ్బందితో కలిసి ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండకు వెళ్లే మార్గంలో ఏలేరు కాలువ వద్ద మాటు వేశారు. కొద్దిసేపటి తరువాత ఆ మార్గంలో వస్తున్న ఆటో, కారు, బొలేరో వాహనాలను ఆపి తనిఖీ చేశారు. 128 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. మూడు వాహనాలతోపాటు నిందితుల నుంచి రూ.1.3 లక్షల నగదు, ఆరు మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి, ఎం.కోడూరుకు తీసుకువచ్చి నిల్వ చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసును పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. మీడియా సమావేశంలో పట్టణ సీఐతోపాటు ఎస్ఐలు డి. ఈశ్వరరావు, వి.సత్యనారాయణ, ఎ. వెంకటేశ్వరరావు, సంతోష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిన ధాన్యం కొనుగోళ్లు

... 5వ పేజీ తరువాయి


నాతవరం మండలంలో పొలాల్లోనే వున్న వరికుప్పలు

సేకరించారు. మండలంలో అధికారులు విధించిన లక్ష్యం పూర్తి కావడంతో కొనుగోళ్లు నిలిపివేసినట్టు రైతు సేవా కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించగా, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ధాన్యం కొనుగోళ్లు చేపట్టడానికి సిద్ధంగా వున్నామని చెప్పారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులు వరి కుప్పలు ఇంకా నూర్చకపోవడంతో ధాన్యం కొనుగోళ్లను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు ఏవో ఆదినారాయణ తెలిపారు. ఖరీఫ్‌లో వరి సాగు చేసిన భూముల్లో రైతులు వరి కోతల అనంతరం అపరాల పంటలు వేశారని, దీనివల్ల వరి కుప్పలను అప్పట్లో నూర్చలేదని చెప్పారు. ప్రస్తుతం అపరాల పంటల కోతలు జరుగుతున్నాయని, ఇవి పూర్తయిన తరువాత వరి కుప్పలు నూరుస్తారని అన్నారు. ధాన్యం విక్రయానికి రైతులు ముందుకు వచ్చిన వెంటనే కొనుగోళ్ల ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ఎస్.రాయవరం మండలంలో..

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారం రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లను తాత్కాలికంగా ఆపేశామని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. మండలంలో 800 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యం కాగా, గత వారం వరకు 664 టన్నుల ధాన్యం సేకరించినట్టు చెప్పారు. పొలాల్లో అపరాల పంటలు వుండడంతో కొంతమంది రైతులు వరి నూర్పులను వాయిదా వేసుకున్నారని తెలిపారు. అయినప్పటికీ రైతుల నుంచి మరో 400 టన్నుల వరకు ధాన్యం సేకరించే అవకాశం వుందన్నారు.

మార్కెటింగ్ మాయ!

... 5వ పేజీ తరువాయి

అమ్ముకోవాలని సూచించారు. విశాఖ రైతుబజార్లకు 80 శాతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ అనకాపల్లి, అల్లూరి జిల్లాల నుంచే వస్తాయి. ఇదిలావుండగా అచ్యుతాపురం పరిసర గ్రామాలలో సుమారు 300 మంది రైతులు టమాటా వేశారు. వారికి స్థానికంగా 25 కిలోలకు రూ.150 నుంచి రూ.200కు మించి ధర రావడం లేదు. ఆ విషయం తెలిసి అక్కడకు వెళ్లిన డిప్యూటీ డైరెక్టర్, తదితరులు విశాఖపట్నం రైతుబజార్లకు వచ్చి అమ్ముకోవాలని సూచించారు. దాంతో వారు మంగళవారం గాజువాక, గోపాలపట్నం, కంచరపాలెం, అక్కయ్యపాలెం తదితర బజార్లకు వచ్చారు. ఉదయం కిలో ధర రూ.12 పెట్టారు. సాయంత్రం దానిని రూ.14గా మార్చారు. సాయంత్రం బజార్‌కు వచ్చిన సరకును అనంతపురం నుంచి తెప్పించామని, అందువల్ల కిలో రూ.14కి విక్రయించాలని అధికారులు ఆదేశించారు. దాంతో రైతులు హతాశులయ్యారు. ఇక్కడ రోజుకు 20 టన్నుల పంట అందుబాటులో ఉండగా, దానిని అమ్మడానికి ఏర్పాట్లు చేయకుండా, ఎక్కడి నుంచో అనంతపురం నుంచి తెప్పించి, ఇక్కడ స్థానిక రేట్ల కంటే ఎక్కువకు అమ్మడం ఏమిటని ప్రశ్నించారు. అందుకు ఎస్టేట్ అధికారులు...అంత దూరం నుంచి తెప్పించినందున రవాణా చార్జీలు అవుతాయని, అందుకే రేటు ఎక్కువ పెట్టినట్టు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయితే స్థానికంగా దిగుమతి అవుతున్న టమాటాను తీసుకోకుండా దూరం నుంచి తెప్పించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విశాఖ, అనకాపల్లి జిల్లాల జాయింట్ కలెక్టర్లు దృష్టిసారించాలని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

క్రైం... crime news

అనుమానాస్పదంగా లారీ డ్రైవర్ మృతి

» వివాహేతర సంబంధమే కారణమని తల్లి ఫిర్యాదు


రమణ (ఫైల్ ఫొటో)

దేవరాపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వారాది రమణ (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివాహేతర సంబంధమే కారణమని తల్లి ఆరోపిస్తున్నారు.. ఇందుకు సంబంధించి ఎస్ఐ టి.మల్లీశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రైవాడ గ్రామానికి చెందిన వారాది రమణకు పదేళ్ల క్రితం పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన కృష్ణవేణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసైన రమణ రైవాడకు చెందిన వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో భార్యాభర్తలు అనేకసార్లు గొడవలు పడ్డారు. పెద్దలు జోక్యం చేసుకునిఇ రాజీ కుదిర్చారు. మూడు నెలల క్రితం మరోసారి వివాదం తలెత్తడంతో కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా భర్తలో మార్పు రాకపోవడంతో రెండు నెలల క్రితం పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా రమణ తల్లి చిన్నమ్మలు కూలి పనులు చేసుకుంటూ విశాఖలో జీవనం సాగిస్తున్నది. రైవాడలో ఒంటరిగా ఉంటున్న కుమారుడికి రోజూ ఫోన్ చేసి మాట్లాడుతుంటున్నది. ఆదివారం నుంచి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో గ్రామంలో వున్న బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసింది. ఇంట్లో లైట్లు వేసి ఉన్నాయని, ఎంత పిలిచినా పలకడంలేదనిఇ బంధువులు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె మంగళవారం మధ్యాహ్నం రైవాడ వచ్చింది. ఇంటి తలుపులు తెరచి చూసేసరికి తన కుమారుడు మృతిచెంది ఉండడంతో భోరున విలపించింది. తన కుమారుడితో వివాహేతర సంబంధం వున్న మహిళ తాలూకా వారే హత్యచేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ మల్లీశ్వరరావు, అదనపు ఎస్ఐ పి.రాములమ్మ ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. రమణది అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఏలేరు కాలువలోకి ఎక్స్‌కవేటర్.. డ్రైవర్ మృతి


మృతి చెందిన ప్రకాష్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి ఆనుకొని ఉన్న సత్యనారాయణపురం వద్ద ఏలేరు కాలువలో మంగళవారం ప్రమాదవశాత్తూ ఎక్స్‌కవేటర్ పడడంతో డ్రైవర్ మృతిచెందాడు. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్‌కె రషీద్ అందించిన వివరాల ప్రకారం.. చోడవరం మండలం జి.జగన్నాథపురం గ్రామానికి చెందిన కొటాన ప్రకాశ్ (36) ఎక్స్‌కవేటర్‌తో సత్యనారాయణపురం ఆలయ సమీపంలో కాలువకు ఆనుకొని ఉన్న పిచ్చి తుప్పలను తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపు తప్పి ఏలేరు కాలువలో పడిపోయింది. దీంతో ప్రకాశ్ నీటిలో మునిగి మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రషీద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శ్యాంప్రసాద్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బి.శ్యామ్‌ప్రసాద్(28) వేంపాడు వద్ద ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడు ఎస్.సాయిబాబుతో కలిసి హెటెరో కంపెనీలో పనిచేస్తున్న మరో స్నేహితుడిని కలవడానికి బైక్‌పై బయలుదేరారు. వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఓ లారీని తప్పించబోయి ఆగిఉన్న మరో లారీని ఢీకొట్టారు. దీంతో శ్యామ్‌ప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా, సాయిబాబుకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై నక్కపల్లి సీఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్ మైదానంలో వ్యక్తి అనుమానాస్పద మృతి


హైస్కూల్ మైదానంలో మృతదేహం

చోడవరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉండడం కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం స్థానికులు హైస్కూల్ మైదానంలో వాకింగ్ చేస్తుండగా, ప్రహరీగోడ పక్కన వ్యక్తి చనిపోయి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతిచెందిన వ్యక్తికి సుమారు 60 సంవత్సరాల వయసుంటుంది. మృతదేహం పడి ఉన్న తీరుతోపాటు, నోటి నుంచి రక్తం రావడంతో ఇతని మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి జేబులో ఎన్‌ఏడీ కొత్తరోడ్డు నుంచి చోడవరం వరకు తీసిన ఆర్టీసీ బస్సు టికెట్ మినహా ఇతర వివరాలు లేవు. ఎవరైనా కొట్టి హైస్కూల్ మైదానంలో పడేశారన్న అనుమానాలను స్థానికులు వ్యక్తంచేస్తున్నారు. కాగా ఇతను గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని సీఐ అప్పలరాజు అభిప్రాయం వ్యక్తంచేశారు. మృతుడి వివరాల కోసం ప్రయత్నిస్తున్నామని, వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వృద్ధురాలి మృతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్ వద్ద భిక్షాటన చేస్తున్న 80 ఏళ్ల వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. ప్రతి రోజూ వీల్ చైర్ మీద వచ్చి భిక్షాటన చేసుకొని వెళ్లిపోతుంది. మంగళవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వచ్చిన కొద్ది సేపటికే వీల్ చైర్‌లో కుర్చొని చనిపోయింది. దగ్గర బంధువులు వచ్చి మృతదేహాన్ని తీసుకుపోయారు. ఆమె పేరు, ఊరు వివరాలు తెలియవని పోలీసులు తెలిపారు.

24 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

నక్కపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లివానిపాలెం జంక్షన్ వద్ద ముగ్గురు వ్యక్తుల నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు నుంచి బ్యాగులతో నడుచుకుంటూ నక్కపల్లి వైపు వస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు హైవే వెంబడి వెళుతుండగా ఆ వ్యక్తులు సారిపల్లివానిపాలెం వద్ద కనిపించారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 24 కిలోల గంజాయి లభ్యమైంది. వీరు తమిళనాడు రాష్ట్రానికి చెందిన తమిళ్ అరసు, సెల్వన్, రాజేంద్రన్‌గా గుర్తించారు. ఏవోబీలో గంజాయి కొనుగోలు చేసి తీసుకెళుతున్నట్టు తమ దర్యాప్తులో తేలిందని పోలీసులు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సభలు, సమావేశాలపై రేపు సాయంత్రం వరకు నిషేధం

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అంతటా 48 గంటలపాటు నిషేధాజ్ఞలు అమల్లో వుంటాయని కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు సభలు, సమావేశాలు, ఊరేగింపులపై నిషేధం విధించామని, ఎక్కడా లౌడ్ స్పీకర్లను ఉపయోగించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్‌కు 200 మీటర్ల పరిధిలో (ఓటు వేయడానికి క్యూలో వున్న వారికి మినహాయింపు) ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడదని హెచ్చరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	68.00
లైవ్ ధర	88.00
విత్ స్కిన్	146.00
స్కిన్ లెస్	156.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	480
విజయనగరం	484
శ్రీకాకుళం	484